




టమోటాలో మంచివి, మచ్చలు ఉన్న వాటిని గ్రేడింగ్ చేస్తున్న రైతు

గౌరవప్రదంగా పెన్షన్ పంపిణీ

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



లబ్ధిదారుకు పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కలకడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్‌ను లబ్ధిదారులు అసౌకర్యానికి గురికాకుండా వారికి గౌరవప్రదంగా పంపిణీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన కలకడ మండలం బాటవారిపల్లె పంచాయతీలో పెన్షన్‌ల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వితంతు, చేనేత, వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారులు శాంతమ్మ, చిన్నరెడ్డెప్ప, రవీంద్రకు నగదును అందజేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ పెన్షన్ ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తున్నారా... ఏ సమయానికి పంపిణీ చేస్తున్నారు.. అని వారిని ఆరా తీశారు. బయోమెట్రిక్ యంత్రాల స్థితిపై డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావును ప్రశ్నించి అవసరమైన ప్రాంతాల్లో కొత్త వాటిని పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంఈవో రామచంద్రారెడ్డి, ఏపీఎం పురుషోత్తంరెడ్డి, ఏపీవో సుజాత, పీడీవోలు నందిని, దేవేంద్ర పాల్గొన్నారు.

కరవు గడ్డలో కృష్ణమ్మ గలగలలు...

● నిరాటంకంగా కొనసాగుతున్న ప్రవాహం
● మూడు టీఎంసీలు.. 123 చెరువులు పూర్తి
● మరో వంద చెరువులు నింపేలా ప్రణాళిక
● ఫిబ్రవరి వరకు జలాలు కొనసాగే అవకాశం
● తాగు, సాగునీటికి తప్పిన ఇబ్బందులు

6



హంద్రీ-నీవా కాలువలో కుప్పం వైపు సాగుతున్న కృష్ణమ్మ

జాగ్రత్తలతో ఎయిడ్స్‌ను తరిమికొడదాం

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య

రాయచోటిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా రాయచోటి ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ మీదుగా డైట్ కళాశాల వరకు చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అది అంటించుకునే వ్యాధి అని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారిని దూరం చేయవచ్చునన్నారు. యువత ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకొని ఇతరులకు తెలియజేయడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాధిక, రాయచోటి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, సూపర్‌వైజర్ పీవీ ప్రసాద్, సిలార్‌సాబ్, ప్యారంపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, డీఎంవో రామచంద్రారెడ్డి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హైదర్, వీసీఎస్ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి, డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, చందనశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పగుళ్లు.. తెగుళ్లు..!

● ధర ఉన్నా.. ఆదాయం లేదు...
● తుఫాన్ దెబ్బకు రైతు విలవిల...
● 30 శాతం మంచివి.. 70 శాతం మచ్చలు
● ఈసారీ టమోటా రైతుకు నష్టాలే



వర్షాలకు పగుళ్లు, మచ్చలు వచ్చిన టమోటాలు



తోటలో కుప్పలుగా రాలిపోయిన టమోటా

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టమోటా పంట సాగు రైతుల పాలిట జూదంగా మారింది. దిగుబడి ఉన్న సమయంలో ధర ఉండదు... ధర ఉంటే దిగుబడి ఉండదు.. ఇలా టమోటా పేకాటను తలపిస్తూ రైతులకు భారంగా మారుతోంది. ప్రస్తుతం ధర బాగా ఉన్నా ఇటీవల వచ్చిన తుఫాన్ దెబ్బకు టమోటాకు తెగుళ్లు సోకడంతో పాటు మచ్చలు రావడంతో అటువంటి కాయలను కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో పాటు గత మూడు రోజులుగా దిత్వా తుఫాన్ ప్రభావంతో ముసురేయడంతో అరకొరగా ఉన్న మంచి కాయలు కూడా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సంబేపల్లె, చిన్నమండెం, కలకడ, కేవీ పల్లి, తంబళ్లపల్లి, మదనపల్లె, గుర్రంకొండ, ములకలచెరువు ప్రాంతాల్లో టమోటా విస్తారంగా సాగు చేస్తారు. ఈ ఏడాది సుమారు నాలుగు వేల ఎకరాల్లో టమోటా పంట సాగులో ఉంది. రెండు, మూడు సంవత్సరాలకు టమోటా రైతులకు కలిసి రాలేదు. ఈసారి టమోటా సాగులో నష్టాలే అంటున్నారు రైతులు. ఒకప్పుడు రైతులకు లక్షల్లో ఆదాయాన్ని ఇచ్చే పంట ఏదైనా ఉందంటే అది టమోటా.... రానురాను పెట్టుబడులు పెరిగాయి. కూలీల వేతనం పెంచారు. పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. ఒకప్పుడు ఎకరా సాగుకు 60 నుంచి 70 వేలు ఉండేది. ప్రస్తుతం లక్ష నుంచి లక్షన్నర పెట్టుబడి వస్తోంది. ధరలు చూస్తే ఏడాదిలో ఎప్పుడు పెరుగుతాయో ఎప్పుడు తగ్గుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా టమోటా రైతులకు నష్టాలు తప్ప లాభాలు కనిపించడం లేదు. ఈసారి తుఫాన్ దెబ్బకు టమోటా తోటలను తెగుళ్లు చుట్టుముట్టాయి. వర్షాలకు మచ్చలు పడి దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం మంచి ధర ఉన్నా కాయలకు మచ్చలు రావడంతో అవి కొనేందుకు వ్యాపారులు మొగ్గు చూపడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

30 శాతం మంచివి, 70 శాతం మచ్చలు

జిల్లా వ్యాప్తంగా ఇటీవల తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో టమోటా తోటలపై తీవ్ర ప్రభావం పడింది. మందులు కొట్టినా ప్రయోజనం లేదు. కాయలకు పగుళ్లు, మచ్చలు వచ్చాయి. దిగుబడిలో ఉన్న మంచివి 30 శాతం మాత్రమే ఉండడంతో ధర ఉన్నా ప్రయోజనం లేదంటున్నారు రైతులు. 70 శాతం టమోటా మచ్చలతో మార్కెట్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. తోటల్లో వర్షాలకు ఆకులు నల్లబడిపోయాయి. మందులు కొట్టినా వర్షాలతో పనిచేయడం లేదంటున్నారు. బూడిద తెగులు, పాముసార వంట తెగుళ్లు ఆశించాయి. దీంతో లక్షల్లో పెట్టుబడి పెట్టినా రైతులు పెట్టుబడులు రాక నష్టాలు తప్పడం లేదంటున్నారు.

పెట్టుబడి రాలేదు.. నష్టాలే మిగిలాయి



నా పేరు వెంకటేశ్వర్లు. మాది ప్రకాశం జిల్లా దర్శి. ఈ ప్రాంతంలో బంధువులు ఉండటంతో ఇక్కడికి వచ్చి మూడేళ్లుగా టమోటా పంట సాగు చేస్తున్నా. సంబేపల్లె నగిరి ప్రాంతంలో మూడు ఎకరాలు టమోటా పంట సాగు చేశా. కొత్త సాగు కావడంతో సుమారు 9 లక్షలు పంట సాగుకు పెట్టుబడి వచ్చింది. వర్షాలతో తోటలో టమోటా కాయలు రాలిపోయాయి. తోట నల్లగా మాడిపోయింది. దిగుబడి ఉన్నా మందులు కొట్టినా మచ్చలు, పగుళ్లు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర ఉన్నా ప్రయోజనం లేదు. ప్రతి ఏడాది టమోటా పంట సాగులో రైతుల పరిస్థితి పది మందిలో ఏడుగురు నష్టపోతున్నారు. ముగ్గురే లాభాలు ఆశిస్తున్నారు. ఒకసారి టమోటా లాభాలు వస్తే మూడుసార్లు నష్టపోతున్నాం. ఆశ వీడక సాగు చేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, టమోటా రైతు

స్క్రబ్ టైఫస్ దడ

● జిల్లాలో 97 కేసులు నమోదు
● శరీరంపై నల్లని మచ్చలు, దద్దుర్లు
● తలనొప్పి, జ్వరం వ్యాధిలక్షణాలు
● సకాలంలో గుర్తించకుంటే ప్రమాదమే



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం ద్వారా జ్వరం బారిన పడతారు. ఈ కీటకం కుట్టిందంటే దీని నుంచి 'ఓరియెంటియో సుత్సుగాముషి' అనే బ్యాక్టీరియా మనిషిలోకి చేరుతుంది. ఈ బ్యాక్టీరియా ప్రభావంతో శరీరంపై నల్లని మచ్చలు, దద్దుర్లు వస్తాయి. వారం పదిరోజుల తరువాత జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, జీర్ణ సమస్యలు తలెత్తుయి. సకాలంలో గుర్తించకపోతే శ్వాస సంబంధిత, మెదడు, వెన్నెముక ఇన్‌ఫెక్షన్‌లకు లోనై మూత్రపిండాలు దెబ్బతింటాయని వైద్యులు చెబుతున్నారు. దీనికి సకాలంలో వైద్యం చేయించకపోతే తీవ్ర ప్రమాదమే. ఈ తరహా కేసులు జిల్లావ్యాప్తగా నమోదవుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 97 కేసులు నమోదయ్యాయి. ఎక్కువ కడప నగరంలో నమోదు కావడం గమనార్హం. స్క్రబ్ టైఫస్ జ్వరానికి కారణమయ్యే నల్లిలాంటి కీటకాలు ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు ఎక్కువగా ఉంటాయి. ఇవి కుట్టడం ద్వారా బ్యాక్టీరియా మనిషిలో చేరి అనారోగ్యానికి గురిచేస్తుంది.

కడపలో అధికం

స్క్రబ్ టైఫస్ బారిన పడిన వారు కడపలో అధికంగా ఉన్నారు. ఒక్క కడప నగరంలోనే సుమారు 50 కేసులు నమోదయ్యాయి. బద్వేలు, ఖాజీపేట, సీకేదిన్నెలో 5 చొప్పున, మైదుకూరులో 4, ప్రొద్దుటూరు, ఒంటిమిట్టలో 3 చొప్పున కేసులు నమోదయ్యాయి. చెన్నూరులో 6, కమలాపురం, కలసపాడు, వల్లూరు, బి.మఠంలో 2 రెండు చొప్పున కేసులు నమోదు కాగా.. కలసపాడు, దువ్వూరు, పోరుమామిళ్ల, ఎర్రగుంట్ల, చాపాడులో ఒక్కో కేసు నమోదైంది. మొత్తంగా జిల్లాలో 97 కేసులు నమోదయ్యాయి.

ఐదేళ్లుగా..

జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు ఐదేళ్లుగా నమోదవుతున్నాయి. అయితే ఈ కేసులు ప్రతి సంవత్సరం పెరుగుతుండటం వైద్యులను, ప్రజలను కలవరపరుస్తోంది. 2021లో 6 కేసులు నమోదు కాగా 2022లో 32, 2023లో 43, 2024లో 48 కేసులు, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 97 కేసులు నమోదయ్యాయి.

రిమ్స్‌లో రక్త పరీక్షలు

స్క్రబ్ టైఫస్ బారిన పడితే దానిని గుర్తించడానికి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ల్యాబ్ ఉంది. అనుమానిత లక్షణాలు ఉన్నవారి రక్తాన్ని పరీక్షించి ఇక్కడ నిర్ధారణ చేస్తారు. ఇప్పటికే ఈ వ్యాధి బారిన పడినిక కొందరికి రిమ్స్‌లో ట్రీట్‌మెంటు ఇచ్చి పంపించారు. ఇది మనుషుల నుంచి మనిషికి వ్యాపించే వ్యాధి కాదని జిల్లా వైద్యాధికారి నాగరాజు వెల్లడించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉన్నాయన్నారు. చికిత్స అందుబాటులో ఉందన్నారు.



ఇవి ఎక్కడ ఉంటాయంటే..

ఈ కీటకం కుడితే అస్వస్థతకు గురవుతారు. ఇవి తడి నేల, తోటలు, పొలాలు, పశువుల పాకల వద్ద ఉంటాయి. ఈ ప్రాంతాల్లో తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలి. తోటల్లోకి వెళ్లినప్పుడు ఫుల్ షర్టు వేసుకోవడంతో పాటు సాక్సు, బూట్లు ధరించాలి. పాత మంచాలు, పరుపులు, దిండ్లలో సైతం ఈ కీటకం ఉంటుంది.

వాయిదా పడిన డిగ్రీ, పీజీ పరీక్షలు 6, 9 తేదీలలో నిర్వహణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా వాయిదా పడిన యోగివేమన విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ పరీక్షల నూతన తేదీలను విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వి కృష్ణారావు సోమవారం ప్రకటించారు. డిసెంబరు 1వ తేదీన డిగ్రీ వారికి జరగాల్సిన పరీక్షను ఈనెల 6వ తేదీ ఉదయం నిర్వహిస్తున్నామన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంటిగ్రేటెడ్ పీజీ విద్యార్థులకు ఈనెల 9వ తేదీ ఉదయం పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.

సొంతింటి కల సాకారానికి 14 వరకు గడువు



(కడప-ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) ఎన్టీఆర్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదల ఇళ్ల కోసం ఆవాస్ యాప్ ప్లస్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 22 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్‌కార్డు వివరాలు, అద్దెకు ఉంటున్న వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంటు, హౌసింగ్ ఏఈల ద్వారా ఆ యాప్‌లో నమోదు చేయించుకోవాలి.

అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టు రట్టు

● డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్
● సీఐడీ , ఈడీ అధికారులమంటూ వృద్ధుడికి వల
● రూ.48 లక్షలు కాజేసిన కేటుగాళ్లు
● రూ.32 లక్షల నగదు, 25 ఏటీఎం కార్డులు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మీడియా సమావేశంలో సైబర్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



స్వాధీనం చేసుకున్న నగదు, ఏటీఎం కార్డులు, సెల్ ఫోన్లు

రాయచోటిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కేంద్రంగా డిజిటల్ అరెస్ట్, ఫేక్ సీఐడీ, ఈడీ అధికారుల అవతారమెత్తి భారీ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ నేర ముఠా గుట్టును మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వివరించారు. మదనపల్లెకు చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ మేల్ నర్స్ రేపూరి బెంజిమెన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా బాధితుడికి కాల్ చేసి మీ పాన్‌కార్డును వాడుకుని అకౌంట్స్ ఓపెన్ చేశారు. ఢిల్లీలో మీ పేరు మీద సీఐడీ, ఈడీ కేసు నమోదు చేసింది. మీ అకౌంటులో రూ.48 లక్షలు డబ్బులు పడ్డాయంటూ రిసిప్ట్ పంపి వెంటనే డబ్బులు రీఫండ్ చేయాలని, లేకుంటే అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకెళ్తారంటూ భయభ్రాంతులకు గురి చేసి జూలై 25వ తేదీ రూ.48 లక్షలు వారి అకౌంట్లకు బదిలీ చేసుకున్నారని తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం రాయచోటిలో పఠాన్ ఇంతియాజ్‌ఖాన్, షేక్ అమీన్, షేక్ అర్షాద్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32 లక్షల నగదు, 25 ఏటీఎం కార్డులు, 3 మొబైల్ ఫోన్లు, 4 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే అదనంగా నిందితుల ఖాతాల్లో ఉన్న రూ.7.65 లక్షలను ఫ్రీజ్ చేశామన్నారు. నిందితులు కాంబోడియా - కువైట్ కేంద్రంగా ఈ అంతర్జాతీయ రాకెట్‌ను నడిపిస్తున్నారని వివరించారు. నిందితులు అమాయక ప్రజలకు వీడియో కాల్స్ చేసి, మీ పేరుపై డ్రగ్స్ కేసులు, ఫేక్ ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, సీబీఐ, ఈడీ అధికారులమంటూ భయభ్రాంతులకు గురి చేసి భారీ మొత్తంలో డబ్బును వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించుకుంటారన్నారు. డబ్బు పడిన వెంటనే ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసి సీడీఎం మిషన్ల ద్వారా ఇతర ఖాతాలకు మళ్లిస్తూ వాట్సాప్ సాక్ష్యాలను వెంటనే చెరిపివేస్తారన్నారు. సాంకేతిక నిఘా ఆధారంగా మదనపల్లె డీఎస్పీ ఎస్. మహేంద్ర ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐలు అన్సర్‌బాషా, శివకుమార్, పోలీసు సిబ్బంది ముగ్గురు నిందితులను పట్టుకున్నారన్నారు. డిజిటల్ అరెస్టు అనేది పూర్తిగా బూటకమని, అపరిచితులు వీడియో కాల్స్ చేస్తే లిఫ్ట్ చేయవద్దని, మీ ఆధార్, ఓటీపీ, బ్యాంకు పిన్ నెంబర్లను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, మదనపల్లె డీఎస్పీ ఎస్.మహేంద్ర, మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ, సైబర్ సెల్ సీఐ మహమ్మద్‌అలీ, ఎస్ఐలు అన్సర్‌బాషా, శివకుమార్, పోలీసు సిబ్బంది, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు చేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పథకాలు, పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్డీవో, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, శానిటేషన్ పనుల్లో పురోగతి సాధించి ప్రభుత్వం సేకరిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్‌లో జిల్లా స్థానాన్ని మెరుగుపరిచేందుకు ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ములకలచెరువు పెద్దమండెం, సంబేపల్లె, రామసముద్రం, పుల్లంపేట ఈ కార్యక్రమంలో చాలా వెనుకబడి ఉన్నాయని ఈ మండలాలు పురోగతి సాధించాలని తెలిపారు. ఆవాస్ ప్లస్ సర్వే జిల్లాలో హౌసింగ్, ఇంజనీరింగ్, ఎంపీడీవోలు, అధికారులు చాలా బాగా చేశారని ఇంకా మిగిలి ఉంటే రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆర్ఎల్, ఆర్‌సీ, స్టేజ్ కన్వర్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 5న జరిగే మెగా పీటీఎం కార్యక్రమానికి జిల్లాలోని 2140 పాఠశాలల్లో ఆ రోజున షెడ్యూల్ ప్రకారం నిర్వహించే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, సీపీవో వెంకట్, ఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ, హార్టికల్చర్, సెరికల్చర్, డ్వామా, ఇరిగేషన్, డీఈవో, హౌసింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, మత్స్యశాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

కరవు గడ్డలో కృష్ణమ్మ గలగలలు...

- నిరాటంకంగా కొనసాగుతున్న ప్రవాహం
- మూడు టీఎంసీలు..123 చెరువులు పూర్తి
- మరో వంద చెరువులు నింపేలా ప్రణాళిక
- ఫిబ్రవరి వరకు జలాలు కొనసాగే అవకాశం
- తాగు, సాగునీటికి తప్పిన ఇబ్బందులు

మదనపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను సస్యశ్యామలం చేసే హంద్రీ-నీవా కల సాకారం అవుతోంది. మొదటి, రెండో దశ పనులు పూర్తయి, మొదటిసారిగా కృష్ణమ్మ ప్రవాహం మొదలైన 2018 నుంచి తీసుకుంటే ఈ ఏడాదిలో ఇప్పటికే రికార్డు స్థాయిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విచ్చేసింది. హంద్రీ-నీవా పథకం ప్రారంభించినప్పటి నుంచీ నీరు పారించడం వరకూ అపర భగీరథునిగా రికార్డు సొంతం చేసుకున్న సీఎం చంద్రబాబునాయుడు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. పట్టువదలని విక్రమార్కుడిలా పనులు పూర్తి చేయించి అనుకున్న లక్ష్యం చేరుకున్నారు. భౌగోళికంగా ఎక్కడో ఉన్న శ్రీశైలం నుంచి మరెక్కడో ఉన్న కుప్పం వరకు 750 కి.మీ. దూరం కృష్ణమ్మను తీసుకెళ్లడంలో సఫలీకృతమయ్యారు. కరువుగడ్డను సస్యశ్యామలం చేస్తున్నారు. పుంగనూరు బ్రాంచీ కెనాల్ ప్రారంభమయ్యే కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి ఆగస్టు 17వ తేదీ కృష్ణమ్మ ప్రవాహం మొదలైన ఏడు రోజుల్లోనే కుప్పం చేరుకుంది. అక్కడక్కడా చిన్నపాటి అడ్డంకులు, అవరోధాలు మినహా రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరాటంకంగా సాగుతోంది. ఎన్నడూ లేని విధంగా, ఎవరూ కలలో కూడా ఊహించని కృష్ణా జలాల గలగలలు, పరవళ్లు చూసిన రైతులు, ప్రజల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. మొదటగా కుప్పానికి వెళ్తున్న కృష్ణమ్మను మధ్యలో ఆహ్వానిస్తూ చిన్నపాటి కుంటలు, చెరువులు నింపుకోవడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. మొదట్లో అడ్డంకులపై ఆంక్షలు విధించిన అధికారులు, ఆ తర్వాత చూసీచూడనట్లు ఉండిపోతున్నారు. ఫలితంగా మార్గమధ్యలో అనధికారికంగా మరిన్ని చెరువులు నిండుతున్నాయి.

హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి పుంగనూరు, కుప్పం బ్రాంచీ కెనాల్‌కు ఆధారమైన చెర్లోపల్లెకు 500 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా, అక్కడి నుంచి పుంగనూరు బ్రాంచీ కెనాల్ మొదలయ్యే 75 కి.మీ. వద్ద ఔట్‌ఫ్లో 350 క్యూసెక్కులు ఉంది. ఇందులో చెర్లోపల్లెకు ముందు భాగాన ఎనిమిది, ఆ తర్వాత పుంగనూరు బ్రాంచీకెనాల్‌పై మరో ఎనిమిది ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ప్రతి సంపులోనూ మూడు మోటార్లు పనిచేస్తున్నాయి. ఇలా సత్యసాయి జిల్లా దాటి అన్నమయ్య జిల్లా పీటీఎం మండలంలో ప్రవేశానికి 300 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. అలాగే కుప్పం బ్రాంచీ కెనాల్ మొదలయ్యే పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వద్ద 230 క్యూసెక్కులతో మొదలైన ప్రవాహం కుప్పానికి 160 క్యూసెక్కులు వెళ్తోంది. ఇలా ఇప్పటికే పరమసముద్రంచెరువు, వీరపునాయుని చెరువుతో 80 చెరువులు నిండిపోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముఖ్యంగా పడమట కృష్ణమ్మ పరవళ్లతో కరవుగడ్డ పులకిస్తోంది. చెరువుల కిందనే కాదు..కాలువల్లో ప్రవాహంతో భూగర్భజలాలు మరింత పెరిగాయి. ఇక సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పినట్లేనని రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీ-నీవా చరిత్రలో మొదటిసారిగా కుప్పానికి కృష్ణా జలాలు తీసుకెళ్లడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. 2018 నుంచి ఇప్పటి వరకూ గతేడాది మినహా ప్రస్తుతం ఏడోసారి వస్తున్న ప్రవాహం రికార్డు స్థాయికి చేరింది. ఇప్పటి వరకు సాగిన ప్రవాహం విడతల్లో మూడు నెలల సీజన్‌లలో 0.60 టీఎంసీకి మించలేదు. ప్రస్తుతం మూడు నెలలకే మూడు టీఎంసీలకు పైబడిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జనవరి నాటికి మరో రెండు టీఎంసీలు, ఫిబ్రవరి చివరికి మరో టీఎంసీలతో కలిపి మూడు టీఎంసీలు తరలించాలని అధికారులు భావిస్తున్నారు. మదనపల్లె హంద్రీ-నీవా సర్కిల్ పరిధిలోని ఎస్ఈ విఠల్‌ప్రసాద్ ఆధ్వర్యంలోని ఈఈ, డీఈల బృందం ముమ్మర ప్రయత్నం చేస్తోంది. కాలువ వెంబడి లైనింగ్ కూడా 70 శాతం పూర్తి కావడంతో ప్రవాహం కూడా సెకనుకు 40-50 సెంటీమీటర్ల చొప్పున రోజుకు 20 కి.మీ. సాగుతోంది. దీనికితోడు విడతల వారీగా కురుస్తున్న వర్షాలు కూడా కలిసొచ్చాయనే చెప్పాలి. ఇప్పటికీ కృష్ణమ్మ 300-350 క్యూసెక్కుల సామర్థ్యంతో ముందుకెళ్తోంది. ప్రస్తుత పరిస్థితులను లెక్కిస్తే, జనవరి నెలాఖరు వరకూ అదే సామర్థ్యంతో ప్రవాహం కొనసాగనుంది. డిసెంబరులో వర్షాలు బాగా కురిస్తే ఫిబ్రవరి చివరి వరకూ కృష్ణమ్మ పరవళ్లు కొనసాగనున్నాయి.

అనంతపురం జిల్లా జీడి పల్లె రిజర్వాయరు నుంచి వచ్చే ప్రవాహం ఆగిపోయినా..ప్రస్తుతం చెర్లోపల్లె రిజర్వాయర్‌లో నిలకడగా కొనసాగే 1.60 టీఎంసీల నీటిలో ఒక టీఎంసీని తీసుకోవచ్చు. ఆ నీరు కూడా నెలన్నర రోజుల ప్రవాహం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని పరిస్థితులు అనుకూలిస్తే ఆలోగానే ఆరు నియోజకవర్గాల్లోని అన్ని చెరువులను నింపే అవకాశం ఉంది. పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్ పరిధిలోని కదిరి, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 2025-26 ఏడాదిలో మొత్తం 202 చెరువులు నింపాలని ప్రతిపాదించారు.


హంద్రీ-నీవా కాలువ నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్న మోటార్లు


కృష్ణా జలాలతో నిండుతున్న సీటీఎం పెద్దచెరువు

	చెరువులు	నింపినవి	కొంత నింపినవి	నింపనున్న చెరువులు
పలమనేరు				
బ్రాంచ్ కెనాల్	80	46	15	27
కదిరి	04	00	00	04
తంబళ్లపల్లె	52	34	07	13
మదనపల్లె	10	03	04	05
పుంగనూరు	09	02	03	06
పలమనేరు	05	06	00	00
కుప్పం				
బ్రాంచ్ కెనాల్	122	90	26	16
పలమనేరు	35	32	07	01
కుప్పం	87	58	19	15

అనుకున్న లక్ష్యాలు సాధిస్తాం



ఈ ఏడాదిలో నిర్దేశిత చెరువులన్నీ కృష్ణా జలాలతో నింపుతాం. ఇప్పటికే సగానికి పైగా పూర్తి చేశాం. మిగిలిన వాటినీ వచ్చే రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తాం. కరువు గడ్డ సస్యశ్యామలం కాబోతోంది. ఈ ఏడాదికి ఆరు టీఎంసీలు తీసుకున్నా.. వచ్చే ఏడాది నాటికి పెండింగ్ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయి వాటాను వాడుకునేలా చర్యలు చేపడుతున్నాం. పీబీసీపై అక్కడక్కడ లైనింగ్‌తో పాటు కాంక్రీటు నిర్మాణాలు కొన్ని చేపట్టాల్సి ఉంది. వాటిని పూర్తి చేయడంపై దృష్టి సారించాం. వీటి నిర్మాణంతో పాటు ఈ ఏడాది ఎదురైన అడ్డంకులు, అవరోధాలను అధిగమిస్తాం.

- ఆర్.విఠల్‌ప్రసాద్, ఎస్ఈ, హంద్రీ-నీవా సర్కిల్, మదనపల్లె

హోంగార్డు కుటుంబానికి సహచరుల ఆర్థిక సాయం


హోంగార్డు కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి సహచరులు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వై.పవన్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు జిల్లా హోంగార్డులు ముందుకొచ్చారు. తమ ఒకరోజు డ్యూటీ అలవెన్సును స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారు. దీంతో మొత్తం రూ.2.30 లక్షలు సమకూర్చి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎస్పీ ద్వారా కుటుంబానికి అందజేశారు. చెక్కును ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మరణించిన హోంగార్డు తల్లి వై.రాధకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహచరులను కోల్పోవడం మా పోలీసు కుటుంబానికి చాలా బాధాకరమని, హోంగార్డు పవన్‌కుమార్‌రెడ్డి మరణం మాకు వ్యక్తిగత నష్టం అని, ఇలాంటి సందర్భాల్లో సహచరులు అండగా నిలవడం గొప్ప సంప్రదాయం అన్నారు. పోలీసు విభాగం ఎల్లప్పుడూ బాధిత కుటుంబంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, ఏఆర్ఎస్ఐ బాలాజీ, బాధిత కుటుంబ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నారు.

క్వారీ వాహనాలతో రోడ్లు గుల్ల..

సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు


సబ్‌కలెక్టర్ కళ్యాణికి ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోటవారుపల్లె వద్ద క్వారీ వాహనాలతో గ్రామీణ రోడ్లు, పంట పొలాలు నాశనం అవుతున్నాయని ఆ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి చాంబర్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటవారుపల్లె సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సర్పంచ్‌లు నారాయణస్వామి, సొక్కం సత్యనారాయణ మాట్లాడుతూ కోటవారుపల్లె చుట్టుపక్కల 16 క్వారీలు ఉండగా ఇక్కడి నుంచి వచ్చే భారీ వాహనాలతో మూడు గ్రామాలకు వెళ్లే దారులన్నీ ధ్వంసం అయ్యాయన్నారు. జనమిత్ర క్వారీ నుంచి వచ్చే వాహనాలు హంద్రీనీవా కాలువ కట్టపై వెళుతుండటంతో కట్ట దెబ్బతింటోందన్నారు. దీనిపై విచారించి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు. పోలీసుల పేరుతో తనను వేధిస్తున్నారని, గుట్కా కేసులు పెడతామని ఆరుగురు మొబైల్ ఫోన్లతో కాల్ చేసి బెదిరిస్తున్నారంటూ నీరుగట్టువారిపల్లెకు చెందిన బాలకృష్ణ ఫిర్యాదు చేశాడు. వీటితో పాటు 18 మంది వివిధ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి

అధికారుల సమావేశంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ 45 రోజుల కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు 987 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో వాటిలో 961 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని, మిగిలిన 26 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి పెట్టుబడి రాయితీ, ఉత్పాదక, సేవా రంగాల్లోని 27 యూనిట్లకు రూ.57.88 లక్షల విలువైన రాయితీల ప్రయోజనాలను కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కృష్ణకిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, ఏపీఐఐసీ, జిల్లా రవాణాశాఖ అధికారి, విద్యుత్‌శాఖ అధికారి, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల అసోసియేసన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో చెరువులు నింపుతాం : ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో సప్లై చానెళ్లు సరిగ్గా లేని చెరువులను కృష్ణా జలాలతో నింపుతామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మండలంలోని వడ్డిపల్లె వద్ద హంద్రీనీవా జలాలను సింఫోనిక్ పద్ధతిలో దిగువన వున్న సప్లై చెరువులకు వదులుతున్న సందర్భంగా ఎమ్మెల్యే జలహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లడుతూ బసినికొండ, వలసపల్లె పంచాయతీల్లోని చెరువులకు హంద్రీనీవా నీటిని వదులుతామన్నారు. అదే విధంగా ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం పూర్తికి రూ.12 కోట్లు నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, జలవనరులశాఖ ఏఈ రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నవీన్‌చౌదరి, టీడీపీ నాయకులు బాలుస్వామి, కత్తి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అధికారులు

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు


తుఫాను ప్రభావంతో తోటలోనే రాలిపోయిన టమోటాలు


మిరప పంటకు సోకిన కుళ్లు తెగులు

రామసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా పడుతున్న చిరు జల్లులతో పలు పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా టమోటాలు, పిందెలు, పూత రాలిపోయింది. దీంతో పాటు లేత దశలోని టమోటా మొక్కలకు పలు తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. టమోటా ధరలు కొన్ని రోజులుగా ఆశాజనకంగా ఉండగా వర్షంతో పంట నష్టం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప పంటకు కాయలపై కుళ్లు తెగులు సోకడంతో పంట చాలా వరకు దెబ్బతింది. సీజనల్ పంట అయిన అనప పంట ముసురు వర్షంతో చీడపీడలు సోకి పూత రాలిపోయింది.

అలాగే కొత్తమీర, కాలిఫ్లవర్, బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగింతే కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గుర్రంకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లోని హుండీలను టార్గెట్ చేసి దొంగతనం చేస్తున్న ముగ్గురిని సోమవారం అరెస్టు చేసినట్లు వాల్మీకీపురం సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పలు ఆలయాల్లో హుండీల చోరీలు జరిగాయి. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో గుర్రంకొండ ఎస్ఐ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అమిలేపల్లె క్రాస్ వద్ద ముగ్గురిని పట్టుకొని విచారించగా దేవాలయాల్లో హుండీ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారన్నారు. మదనపల్లెకు చెందిన బాలాజీ (45), నిమ్మనపల్లెకు చెందిన బాలు (20), పెద్దపంజాణికి చెందిన రమేశ్ (29) జిల్లాలోని వాల్మీకీపురం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని పలు ఆలయాల్లో హుండీ చోరీ కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి 250 గ్రాముల వెండీ కిరీటం, 25 కిలోల రాగి వైరు, 10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సెల్‌టవర్ కంట్రోల్‌రూంలో అగ్నిప్రమాదం

మంటలను ఆర్పిన అగ్నిమాపక శాఖ సిబ్బంది


సెల్‌టవర్ కంట్రోల్‌రూంలో మంటలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం నేతాజీ కాలనీలోని ఎయిర్‌టెల్ సెల్ టవర్ వద్ద అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో సెల్ టవర్ కంట్రోల్‌రూంలో మంటలు వ్యాపిస్తుండటంతో స్థానికులు గమనించి మదనపల్లె అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ ఫైర్ ఆఫీసర్ శివన్న తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా కంట్రోల్‌రూంలోని బ్యాటరీల్లో కొన్ని పేలడంతో మంటలు ఎగసిపడి కంట్రోల్ రూం మొత్తం అగ్నికి ఆహుతైంది. లోపల ఉన్న బ్యాటరీలు అన్నీ పగలకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ప్రమాదంలో పెద్దఎత్తున ఎయిర్‌టెల్ కంట్రోల్ రూంలో నష్టం వాటిల్లి ఉంటుందంటున్నారు. ప్రమాదంతో ఎయిర్‌టెల్ మొబైల్ సర్వీసులన్నీ పనిచేయలేదు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మదనపల్లె మండలం సీటీఎం గ్రామం మిట్టపల్లెకు చెందిన రవీంద్రారెడ్డి (39) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగి ఈశ్వరమ్మ కాలనీలోని రైస్ మిల్ వద్ద అపస్మారస్థితిలో ఉండగా స్థానికులు గుర్తించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో మరో యువకుడు..

మదనపల్లె పట్టణానికి చెందిన యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ సమస్యలతో మనస్థాపం చెందిన పట్టణంలోని బాలాజీ కాలనీకు చెందిన సుభాష్ (25) విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దేవదాయ ఆస్తుల అక్రమాలపై విచారణ

ఈవో మునిరాజపై శాఖాపరమైన చర్యలు?

బి.కొత్తకోట. డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ పరిధిలోని పలు ఆలయాల భూములు, ఆస్తుల నిర్వహణలో అనేక అక్రమాలకు పాల్పడిన ఈవో మునిరాజపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు ఫిర్యాదుదారుడికి సమాచారం వచ్చింది. చెన్నకేశవస్వామి మాన్యం భూమిని సాగు కోసం లీజుకు తీసుకొని రూ.కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తోడేశారని, విలువైన భూమి ధ్వంసమై ఎందుకూ పనికిరాకుండా పోయిందని, ఇందులో దేవాదాయశాఖ ఈవో మునిరాజ ప్రమేయంపై విచారణ చేయాలని బి.కొత్తకోటకు చెందిన చిట్టారామక్రిష్ణారెడ్డి లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక విచారణాధికారిగా ఆర్ఎస్ రంగాపురం, మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈవో, నంద్యాల డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులును నియమించారు. సోమవారం ఆయన బి.కొత్తకోటకు వచ్చి విచారణ చేపట్టారు. ఈవోపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ లోకాయుక్త ద్వారా సమాచారమిచ్చారు. అయితే దీనిపై రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కమిషనర్ తీసుకున్న నామమాత్రపు చర్యలు ఏమాత్రం సరిపోవని, అవినీతి చేసే అధికారులకు గుణపాఠం చెప్పేలా చర్యలు ఉండాలని, దీనిపై మళ్లీ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వామికి వెండి కిరీటం బహూకరణ

వేంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని కడప బైపాస్‌రోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి ఆలయానికి స్థానిక భక్తుడు రవిశేఖర్ వెండి కిరీటాన్ని బహూకరించారు. లక్ష రూపాయల విలువైన వెండి కిరీటాన్ని అయ్యప్పస్వామి ఆలయ నిర్వాహకులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వెండి కిరీటాన్ని తీసుకెళుతున్న భక్తుడు రవిశేఖర్

మద్యం విక్రేత అరెస్టు

గుర్రంకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ గొల్లపల్లె క్రాస్ వద్ద బెల్టుషాపుపై దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తితో పాటు 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులపై ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగ్గురిపై వేధింపుల కేసు

కలకడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, అత్తమామపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎర్రయ్యగారిపల్లెకు చెందిన రెడ్డిలక్ష్మీకి సోమల మండలం ముడియంవారిపల్లెకు చెందిన వెంకటేశ్‌తో 2015లో వివాహం జరిగిందన్నారు. తిరుపతి స్విమ్స్‌లో ఉద్యోగం చేస్తున్న రెడ్డిలక్ష్మీ 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చిందని, దీంతో భర్త వెంకటేశ్, అత్త సుశీల, మామ శ్రీనివాసులు ఎర్రయ్యగారిపల్లెకు వచ్చి అదనపు కట్నం కోసం వేధించారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలిలా ఉన్నాయి. ఓబుళవారిపల్లె మండలం బాలిరెడ్డిపల్లెకు చెందిన సిరిగిరి గంగమ్మ రాఘవరాజపురం గ్రామం వద్ద కారు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కోడూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో మల్లికార్జున స్వామి

తంబళ్లపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుఫాను ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నా సోమవారం ఉదయమే పలు ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు చేరుకుని భ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు కొండపైన ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



సిగటోక తెగులు సోకిన అరటి పంట

అరటికి.. సిగటోక తెగులు

● అవగాహన లేక నష్టపోతున్న రైతులు ● నివారణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు ● ఉద్యాన అధికారుల సూచనలు

లింగాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అరటి పంటను సిగటోక ఆకు మచ్చ తెగులు పట్టిపీడిస్తోంది. గెల వేయకముందు తెగులు సోకితే చెట్టు పెరుగుదల మందగించి దిగుబడులు తగ్గిపోతాయి. గెలవేసిన తర్వాత సోకితే కాయలు సరైన సైజు రావు. పక్వానికి రాకముందే కాయలు మాగిపోతాయి. చాలా మంది రైతులకు సిగటోకా తెగులుపై సరైన అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారు.



తెగులుతో ఎండిపోయిన ఆకు

పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా అరటి పంటను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. ఈ ప్రాతం రైతులకు కొన్ని సంవత్సరాల నుంచి అరటి పంట ప్రధాన ఆదాయ వనరుగా మారింది. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 26,418 ఎకరాలలో అరటి పంటను రైతులు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం అరటి పంటకు సిగ టోక ఆకుమచ్చ తెగులు వాపిస్తోంది. దీంతో చాలా మంది రైతులు పురుగుల మందుల దుకాణాలలో ఇచ్చే మందులను పిచికారీ చేస్తు న్నారు. పూర్తి స్థాయిలో నివారణ పద్దతులు పాటించడం లేదు. తెగులు సోకినపుడు రైతులు ప్రధానంగా కెమికల్ మందుల పిచికారీ చేసేందుకే మొగ్గుచూపుతున్నారు. కానీ జీవ శిలింద్రాల నాశనులను ఉపయోగించడం లేదు.



సరైన నియంత్రణ పద్ధతులు చేపట్టాలి

అరటిలో సిగోటక ఆకుమచ్చ తెగులు సూడోసరోకస్పోరమ్యూజె అనే శిలీంద్రం ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉన్నపుడు, పగటిపూట ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు, వర్షం కురిసినపుడు వేగంగా చెట్టు అంతా వ్యాప్తి చెంది బలమైన గాలులు వీచినపుడు లైంగిక సిద్దబీజాలు ఒక తోట నుంచి మరో తోటకు వ్యాపించి తెగులు ఉధృతం అవుతుంది. గెలవేసిన తర్వాత ఉపయోగించాల్సిన మందులు అజాక్సీస్ట్రోబిన్ 1 ఎంఎల్, అజాక్సీ స్ట్రోబి న్+డైఫెనాకొనాజోల్ 0.5 ఎంఎల్, అజాక్సీస్ట్రోబిన్+టేబుకొనాజోల్ 1ఎంఎల్, టేబుకొనాజోల్+ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 1గ్రా, ఫైరాక్లోస్ట్రోబిన్+ ఎపాక్సీకొనాజోల్ 1.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి ఉపయోగించాలి. అలాగే గెల వెయక ముందు తెగులు సోకితే కార్బండి జం+ మాంకోజబ్ 1.5గ్రాము, ప్రాఫికొనాజోల్ 1ఎంఎల్, క్లోరోథలోనిల్ 2గ్రా, డైఫెనా కొనాజోల్ 1ఎంఎల్, ప్రాఫికొనాజోల్+డైఫెనాకొనాజోల్ 1ఎం ఎల్, క్లోరోథలోనిల్+డైఫెనా కొనాజోల్ 2ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి 15రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.



సిగటోక తెగులుపై రైతులకు శిక్షణ

అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తుండడతో నివారణ చర్యలు చేపట్టేందుకు ఉద్యాన శాఖ అధికారులు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఇప్పట్ల గ్రామంలో సోమవారం పులివెందుల అరటి పరిశో ధన స్థానం శాస్త్రవేత్త శిరీష సిగటోక తెగులు వ్యాప్తి, చేపట్టాల్సిన నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం తుఫాన్ వలన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత యూరియ, పొటాష్ ఎరు వులను డ్రిప్ ద్వారా అందించాలని సూచించారు. పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ అరిటి గెలకు తొడు గులు వేసిన రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీ మంజూరు చేస్తోందని వివరించారు.

చెడు శిలీంద్రాలను నాశనం చేస్తే ...

జీవ వ్యవసాయం (బయాలాజికల్ ఫార్మింగ్) కెమికల్ మందులను మాత్రమే కాకుండా జీవశిలీంద్ర నాశనులు అయిన ట్రైకోడర్మావిరిడి 5ఎంఎల్, బాసిల్లాస్ సబ్‌స్టిలిస్ 10ఎంఎల్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ 5ఎంఎల్, వేపనూనెను ఉపయోగించి ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. డ్రిప్‌ద్వారా కూడా చెడు శిలీంద్రాలను నాశనం చేస్తే నేలను ఆరోగ్యవంతంగా చేసి మొక్క ఆరోగ్యంగా పెరిగి, మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంది.

-రాఘవేంద్రరెడ్డి, ఉద్యాన అధికారి, పులివెందుల.

మహిళా రైతు సంఘాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ప్రకృతి వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడులను పొందాలి : పీడీ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతు సంఘాలు అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం వార్షిక మహాసభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గతంలో మహిళా సంఘాలు ఉండేవని, అయితే ప్రభుత్వం ప్రస్తుతం మహిళా రైతు సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేస్తోందన్నారు. పంట పొలాల్లో మందులు పిచికారి చేసుకోవడానికి ప్రభుత్వ సబ్సిడీతో డ్రోన్లు రైతు సంఘాలకు ఇస్తోందని, ఆసక్తి ఉన్న మహిళా సంఘాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్ నిధులు, ఎస్టీఎఫ్‌సీ నిధులు, స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళా సంఘం సభ్యులు ఖచ్చితంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని.. వచ్చే డబ్బులతో కంతులు చెల్లించుకుంటూ కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలని పీడీ తెలిపారు. అనంతరం ఆమె స్థానికంగా ఉన్న మహిళా పాలడెయిరీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో రామచంద్రారెడ్డి, వెలుగు ఏపీయం చిన్న ఓబులేసు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సీతారామిరెడ్డి, బాలయ్య, నారాయణ, సుబ్బరాయుడు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, గ్రామ సంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే ఉండేలా సీఎం దృష్టికి...



ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలోనే ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆ మం డలాల ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకోగా వారితో కలిసి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అందుకు స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ బయట శ్రీనివాసరెడ్డి పాత్రికేయులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను అశాస్త్రీయంగా రాజకీయ కుట్రతో విడగొట్టిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా శాస్త్రీయంగానే కాకుండా ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులను సైతం గుర్తించిన తర్వాతే రాష్ట్రంలో కొత్తగా మదనపల్లి, మార్కాపురం జిల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం కడపకు అత్యంత సమీపంలో వున్న సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లాలో చేర్చడం వలన ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఆ రెండు మండలాల ప్రజలు ఆకాంక్షలకు తగినట్లు కడప జిల్లాలోనే ఉండేలా చూడాలని కోరతామన్నారు. కార్యక్రమంలో పలువురు ఆయా మండలాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈనెల 15లోపు పంటల బీమా చెల్లించండి

పులివెందుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే వివిధ రకాల పంటలకు ఈనెల 15లోపు బీమా చెల్లించాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రబీలో పండించే వివిధ రకాల పంటలు నువ్వులు, వేరుశనగ, పెసర, జొన్న, మినుము, వరి, ప్రొద్దుతిరుగుడు, శనగ పంటలకు సంబంధించి రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. ఆధార్‌కార్డు, భూమి పత్రం, కౌలు రైతుల ధ్రువీకరణపత్రం, పంట సాగుచేసినట్లు సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా జారీ అయిన పత్రం, బ్యాంకు ఖాతా వివరాలు సంబంధిత మీసేవ కేంద్రాలలో అందించి ప్రీమియం చెల్లించాలన్నారు.

ప్రీమియం ఎకరాలలో : నువ్వులు రూ.180, వేరుశనగ రూ.480, పెసర రూ.270, జొన్న రూ.315, మినుము రూ.285, వరి రూ.630, ప్రొద్దుతిరుగుడు రూ.300, శనగ రూ.480 చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శిక్షణ

● డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజజుల పాటు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మారుతున్న టెక్నాలజీ రంగంలో విద్యార్థులు మరింత నిష్ణాతులు కావాలంటే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈ కేంద్రం ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. అంతర్జాతీయ సంస్థలైన ఐబీఎం శాస్త్రవేత్తలు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్లు, డాటా టెక్ ఏఐ సి-డాక్ నుంచి నిష్ణాతులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇప్పటికే 150 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసు కున్నారని, ఇతర సంస్థల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఏఓ రవికుమార్, అధికారులు రత్నకుమారి, భాస్కరయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఏసీఏ అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా మారాయి. ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ - సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. ఇందులో ఎస్.ఎం.ఇజహర్ 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్‌కు దిగే సమయానికి వెలుతురు సరిగా లేకపోవడంతో ఆటను నిలిపేశారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నార్త్‌జోన్ విన్నర్స్-సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన సెంట్రల్ జోన్ విన్నర్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. ఇందు లో అక్షిత్‌రెడ్డి 137 పరు గులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయా నికి ఒక్క ఓవర్ ఆడి వికెట్ నష్టపోకుండా పరు గుల ఖాతా తెరవలేదు.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు- రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 69.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో సాయికృష్ణచైతన్య 88 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు బౌలర్ దీక్షిత్ 5 వికెట్లు పడగొట్టాడు. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అప్పటికి వెలుతురు సరిగా లేని కారణంగా ఆటను నిలుపుదల చేశారు.





అక్షిత్‌రెడ్డి, దీక్షిత్

విద్యార్థి సామాజిక స్పృహ...

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం రెండవ వార్డు స్కూలు వెనకాల వున్న మడూరు కాలువకు రక్షణ గోడలు లేక తన మిత్రుడు సైకిల్ మీద వెళుతూ కాలువలో పడ్డాడు. ఆ పరిస్థితి ఎవ్వరికీ రాకూడదని మున్సిపల్ హైస్కూలుకు చెందిన 6 వతరగతి విద్యార్థి ఎబినేజర్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. సోమవారం ఎబినేజర్ తన తండ్రితో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు కాలువకు రక్షణ గోడలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాలువకు రక్షణ గోడలేక తన స్నేహితుడు సైకిల్ మీద వెళుతూ కాలువ పడ్డాడని.. అక్కడ చూసిన వారంతా కలిసి ప్రాణాలతో కాపాడగలిగారని.. లేకుంటే పరిస్థితి ఏమిటని ఆ విద్యార్థి ఆవేదన చెందారు. ఈ విషయం తన తండ్రి దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకారంతో ఇక్కడి వచ్చానని తెలిపారు. ఇందుకు కమిషనర్ రవిచంద్రారెడ్డి విద్యార్థి ఎబినేజర్‌కు వున్న సామాజిక స్పృహకు మెచ్చుకున్నారు. తక్షణం కాలువకు రక్షణ గోడలు కట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ స్కూలు విద్యార్థి ఎబినేజర్

ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ పత్రాలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారన్నారు. అరుణప్రభ, జి.అంకమ్మ, ఎం.మల్లికార్జున, చిగురుపాటి నాగ మణి, రామేశ్వరం చిన్నయ్య, ఎస్.అజ్మతుల్లాఖాన్, తుంగా విజయలక్ష్మి, అవ్వారు శ్రీలేఖ దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. నామినేషన్ పత్రాలను మంగళవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు కడప మున్సిపల్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో పరిశీలిస్తారన్నారు.

ఉద్యాన పంటల్లోకి వర్షం నీరు

● మూడు రోజులుగా జడివాన ● కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు





తెగిపోయిన రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు, వర్షం నీటితో నిండిపోయిన అరటితోట

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న జడివానతో ఉద్యానపంటల్లోకి వర్షం నీరు చేరింది. అరటి, మామిడి తోటల్లోకి వర్షం నీరు చేరి పొలాల్లోకి రైతులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అరటి తోటల్లోకి భారీగా నీరు చేరడంతో చెట్లు పడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వరద నీటి ప్రవాహనికి రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మధ్య ఉన్న తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఆయా గ్రామాలకు ప్రజల రాకపోకలు స్తంభించాయి.

రైల్వేకోడూరు చుట్టూ ఉన్న గుంజన, ముష్టేరు, గుండాలేరు, తిరుపతి ఏరు, మేకలగుంతేరు తదితర నదులు వరద నీటితో ప్రవహిస్తున్నాయి. మూడు రోజుల నుంచి జడివాన పట్టడంతో అరటి, నర్సరీ, భవన నిర్మాణ కూలీలు తదితరులకు పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వర్షం నీటితో వరినార్లు నిండిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదాయం ఫుల్... రైళ్లు నిల్

● ముద్దనూరులో రైళ్ల స్టాపింగ్ లేక ఇక్కట్లు



ముద్దనూరు రైల్వే స్టేషన్

ముద్దనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ముద్దనూరు రైల్వే స్టేషన్ చూడటానికి రైల్వే జంక్షన్‌ను తలపిస్తోంది. ఈ రైల్వేస్టేషన్ గుండా ఆర్టీపీపీకి ప్రత్యేక లైను నుంచి బొగ్గు రవాణా జరుగుతుంది. అంతేకాకుండా పులివెందుల ప్రాంతం నుంచి తెల్ల కంకర భారీ ఎత్తున గూడ్స్ వ్యాగిన్‌ల ద్వారా తరలిస్తుంటారు. అలాగే ప్యాసింజర్ రైళ్లకు రిజర్వేషన్, తత్కాల్ టికెట్‌ల ద్వారా ఆదాయ వనరులు ఉన్నా ఇక్కడ స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు వెంకటాద్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే ఆపుతున్నారు. ధర్మవరం, దాదర్, మెయిల్ రైళ్లకు స్టాపింగ్ లేకున్నా దాదాపు 100 టికెట్లు రిజర్వేషన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముద్దనూరు, తొండూరు, పులివెందుల ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు గుంటూరు, విజయవాడ వెళ్లాలంటే ధర్మవరం-విశాఖపట్నం రైలు మాత్రమే ఉంది. ముద్దనూరులో స్టాపింగ్ లేకపోవడంతో ఎర్రగుంట్ల వెళ్లాల్సి వస్తోంది. రాత్రి పూట బస్సులు కూడా తక్కువగా ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఏళ్ల తరబడి ముద్దనూరుకు ప్రత్యేకించి వ్యాపార నిమిత్తం నిమ్మకాయల లోడు కోసం చెన్నైకి వెళ్లేందుకు నిలబడుతున్న మెయిల్, దాదర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కరోనా తరువాత స్టాపింగ్ లేదని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల స్టాపింగ్ విషయమై ఈ ప్రాంత నాయకులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతా ధికారులు స్పందించి ముద్దనూరు రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ముద్దనూరు రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ వ్యాగిన్‌కు తరలించేందుకు నిల్వ చేసిన తెల్ల కంకర

మద్యం మత్తులో డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వసంతపేట వీధిలోని బుశెట్టి కల్యాణ మండపం వద్ద సోమవారం డ్రైనేజీలో పూడిక తీస్తుండగా బండల కింద మృతదేహం బయటపడింది. దీంతో స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని పరిశీలించి.. సంఘటనా స్థలంలో ప్రభుత్వ వైద్యుల చేత పోస్టుమార్టం నిర్వహించారు. ఆ మృతదేహం కాలువలో పడి దాదాపు నెలరోజులకు పైబడి వుంటుందని వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడు ఈశ్వర్‌రెడ్డినగర్‌లో 40 రోజుల కిందట అదృశ్యం అయిన బలిమెల సూర్యనారాయణగా గుర్తించారు. ఈ విషయం వారి కుటుంబం సభ్యులకు తెలియజేయగా, మృతదేహంపై వున్న బట్టలు, ఇతర వస్తువుల ద్వారా బలిమెల సూర్యనారాయణగా అతని భార్య రమాదేవి నిర్ధారించారు, వృత్తిరీత్యా అతను నెలల తరబడి లైన్‌మీద పోతుంటారని, ఒక్కోసారి నెల రోజులకు కూడా ఇంటికి రాడని తెలిపారు. కాగా అతను వసంతపేటలోని మద్యం దుకాణంలో తాగి అక్కడే కాలువలో పడి పోయివుండవచ్చని, మృతదేహం బండల కిందికి వెళ్లడంతో ఇన్నాళ్లు ఎవ్వరూ గుర్తించలేదని స్థానికులు వెల్లడించారు.



సూర్యనారాయణ (ఫైల్)

ఎండైనా.. వానైనా.. మాటకు కట్టుబడి ఉంటాం

● పంతగాని నరసింహప్రసాద్



పెన్షన్ పంపిణీ చేస్తున్న పంతగాని నరసింహప్రసాద్

చిట్వేలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎండైనా.. వానైనా.. . ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ప్రభుత్వం తమదని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం తన సొంత గ్రామమైన నాగవరంలో జోరు వానలో ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిబద్ధత కలిగిన మహానేత అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రికి ప్రజల ఆశీస్సులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హత్యరాల పునరావాస కేంద్రం సందర్శించిన చమర్తి

రాజంపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హత్యరాల పునరావాస కేంద్రాన్ని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సోమవారం పరిశీలించారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్, ఆహారం, వైద్య సదుపాయం, పారిశుధ్యం నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అన్ని వసతులు కల్పించాలని అధికారులను కోరారు.

వైభవంగా గీతాజయంతి



గీతా జయంతి కార్యక్రమంలో భక్తులు

రైల్వేకోడూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాలస్వామి ఆలయం లో సోమవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్మయాశ్రమ గీతా ప్రచార కమిటీ అధ్యక్షుడు సుబ్బరాయుడు, సత్సంగ ప్రముఖ్ దరిశా వెంకటరెడ్డి, విశ్వహిందూపరిషత్ నాయకుడు మల్లికార్జున, కోడూరు ఖండ అధ్యక్షుడు వాకచర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఖాదర్‌వలి ఉరుసు

సిద్దవటం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దిగువపేట బేల్దారి వీధిలో ఖాదర్‌వలి దర్గాలో సోమవారం ఉరుసు నిర్వహించారు. దర్గా నుంచి గౌసేపాక్ దర్గా, మస్తాన్ వలి దర్గా వరకు జెండా, చాందినిని మేళతాళాలలు, పకీర్ల విన్యాసాల నడుమ ఊరేగించారు. అనంతరం దర్గాలో చదివింపులు చేసి భక్తులకు పంపిణీ చేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో సోమవారం ఎస్‌ఐ రవీంద్రబాబు, ట్రైనీ ఎస్‌ఐ సుస్మిత, ఏఎస్‌ఐ మస్తాన్ వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఓవర్‌లోడ్, అతి వేగంగా వెళ్లే ఆటో డ్రైవర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్‌తో పాటు అన్ని రికార్డులు కలిగి ఉండాల న్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తామన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు.

భుజంగేశ్వరుడికి పూజలు

రైల్వేకోడూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న భుజంగేశ్వరాలయంలో సోమవారం బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, ధూర్జటి యోగి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఛైర్మన్ ఉంగరాల చిన్నా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

జిల్లా పునర్విభజనపై ఉద్యమం ఉధృతం!

● ప్రజల మనోభావాలను సీఎంకు వివరిస్తా..: చమర్తి ● కలెక్టర్‌కు పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, సిద్దవటం, ఒంటిమిట్టవాసుల వినతి



రాజంపేట జిల్లా కేంద్రానికి మద్దతుగా ప్రసంగిస్తు చమర్తి జగన్‌మోహన్‌రాజు



సిద్దవటం, ఒంటిమిట్ట మండల వాసులతో కలెక్టరేట్ వద్ద శ్రీనివాసరెడ్డి

రాజంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట జిల్లా కేంద్రం వ్యవ హారం ప్రజా ఉద్యమం నుంచి రాజకీయ రంగు పులుము కుంటోంది. సోమవారం రాజంపేటలో జరిగిన టీడీపీ సమావేశంలో ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు మాట్లాడుతూ రాజంపేట ను జిల్లా కేంద్రం చేయాలన్న అం శాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి, స్థానిక ప్రజల మనోభావాలను వారి ఆకాంక్షలను వారికి వివరిస్తామన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం చేస్తే ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల ప్రజలు కూడా స్వాగతిస్తున్నారన్నారు. కోడూరు నియోజకవర్గ ప్రజలు కూడా రాజంపేట జిల్లా కేంద్రం కావాలని పట్టుదలగా ఉన్నార న్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలను సీఎంకు నివేదిస్తామన్నారు. తమను కడప జిల్లాలో కొనసాగించాలని సిద్దవటం, ఒంటిమిట్ట మండల వాసులు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డితో కలిసి సోమవారం కడప కలెక్టర్‌కు విన్నవించారు. రాజంపేట ఆర్ అండ్ బీ బంగ్లా ఆవరణంలో రాజంపేట జిల్లా సాధన సమితి జేఏసీ నాయకుల సమావేశంలో రాజం పేట మార్కెట్‌యార్డు ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్యానాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు మేడికొండు రవికుమార్ నాయుడు, రాజంపేట సింగిల్ విండో అధ్యక్షుడు ములుగూరు సుబ్రమణ్యంనాయుడు, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, రాజంపేట టీడీపీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, టీఎన్ఎస్‌ఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఒక ప్రాంతానికి అనుకూలంగా మాట్లాడటం మంత్రికి తగదు..

రాష్ట్ర మంత్రి వర్గంలో ఉన్న పెద్దలు ఎవరైనా ఒక ప్రాంతానికే అను కూలంగా మాట్లాడటం ఏమాత్రం సమంజసం కాదని రాజంపేట మార్కెట్ యార్డు ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు అన్నారు. ఒక మంత్రి ఒక ప్రాంతానికే పరిమితం కావడం, రాజంపేట ప్రాంతం గురించి మాట్లాడక పోవడం మంచిది కాదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గమనిస్తున్నారన్నారు. రాజంపేట జిల్లా సాధన జేఏసీ నాయకులు సోమవారం సమావేశమై కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో జిల్లా సాధన కోసం నిర్వహించనున్న ఆందోళనల కార్యాచరణపై సమీక్షించారు. ఇక రోజువారి ఉద్యమాన్ని ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లి రైతులు, విద్యార్థులు, యువకులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వ్యాపారులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వారు నిర్ణయించారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం..



రాజంపేట: ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎస్‌ఐ రవీంద్రబాబు, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం మూడు రోడ్ల కూడలిలో వైద్యారోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులను వెలివేయకుండా ఆదరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ హరి, అధ్యాపకులు గంగిరెడ్డి, సహదేవ రెడ్డి, సుందరం, కల్యాణి, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు రూరల్: ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు కీర్తిపాటి ప్రసాద్‌వర్మ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. యశోధర, అధ్యాపకులు వై. నరసింహమూర్తి, ఎం. చంద్రమోహన్‌రాజు, ఏ, రాజేశ్వరి, కే. లక్ష్మీదేవి, ఎస్. మస్తాన్‌సాహెబ్, కృష్ణయ్య, రంగరానాయకులు, నరేంద్ర, పుల్లమరాజు, లత, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రంలో పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి రంగలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి, పి.కొత్తపల్లె వైద్యాధికారిని రంగలక్ష్మీ, సీహెచ్‌వో లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఉప వైద్యశాఖాధికారి డాక్టర్ సానె శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ అధికారి ప్రదీప్‌కుమార్, గ్రామ కార్యదర్శి ఆర్.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలు తొలగించండి

నందలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలు తొలగించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో కేఆర్‌ఎం. ప్రసాద్‌కు స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా మైదానం తూర్పు భాగాన ఉన్న మార్గంలో నుంచి జంతువులు లోపలికి వచ్చి అపరిశుభ్రం చేస్తున్నాయని, ఆ దారిని మూసివేయాలని కోరామన్నారు. రాత్రి వేళల్లో పెద్దగేటుకు తాళం వేసి మూసివేసి క్రీడా అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

దళితుల స్థితిగతులపై ఈవోపీఆర్డీ ఆరా ..



దళితులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ శ్రీకాంత్

పెనగలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుపాను నేపథ్యంలో సోమవారం ఈవోపీఆర్డీ శ్రీకాంత్ పెనగలూరు ఎగువ హరిజనవాడ, ఎగువ కొత్తపల్లె ప్రాంత ప్రజల స్థితిగతులపై ఆరా తీశారు. నెలకిందట రెండు ప్రాంతాల్లోని దాదాపు 30 ఇళ్లలో వారం రోజుల పాటు వరదనీరు నిలిచిపోవడంతో తమను ఆదుకోవాలని ఆ ప్రాంత ప్రజలతోపాటు టీడీపీ నాయకులు బీఎల్ నరసింహారెడ్డి స్థానిక తహసీల్దారు, ఈవోపీఆర్డీలను కోరినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో దిత్వా తుఫాను ప్రభావాన్ని పరిశీలించేందుకు పంచాయతీ కార్యదర్శితో కలిసి ఈవోపీఆర్డీ ఎగువ హరిజనవాడ, ఎగువ కొత్తపల్లెలో పర్యటించారు. తమ ప్రాంతంలో వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటతే అదే మహాభాగ్యమని లోతట్టు ప్రాంతాల ప్రజలుకోరారు.

మందపల్లెలో జన జీవనం దుర్భరం



దెబ్బతిన్న రోడ్లపై నిలిచిన వర్షపునీరు

రాజంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ముంపు ప్రాంతమైన మంద పల్లెలో రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో జీవనం దుర్భరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు తెగిపోయినప్పుడు నీటి ఉధృతికి గ్రామంలోని రోడ్లు, ఇతర మౌలిక వసతులన్నీ కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ప్రభుత్వం, అధి కారులు ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించలేదు. గ్రామంలో సుమారు 150 ఇళ్లుండగా వీధులన్నీ గుంతల మయమయ్యాయి. ప్రస్తుతం ఈ గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇళ్లలోనుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే గ్రామంలో రోడ్లు వేయాలని జిల్లా అధికారులకు, రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజుకు విన్నవించినట్లు గ్రామ టీడీపీ నాయకుడు కొండా శ్రీనివాసులుతెలిపారు.

కలెక్టర్‌తో బీజేపీ నేత సాయిలోకేశ్ భేటీ



కలెక్టర్‌తో చర్చిస్తున్న సాయి లోకేశ్‌కుమార్

రాజంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ భేటీ అయ్యారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. విశ్రాంత మలేరియా అధికారి లావులూరి శ్రీనివా సులు, అన్నమయ్య జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెయ్యేటి వద్ద ఓబిలి టీడీపీ యూత్ కాపలా



అమీరుల్లా బృందాన్ని అభినందిస్తున్న ఎంపీడీవో విజయరావు

పెనగలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను కారణంగా చెయ్యేరులో ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంలో ఎవరూ ఏటిలో దిగకుండా ఓబిలి టీడీపీ ఇన్‌చార్జి ఎస్.అమీరుల్లా అధ్యక్షతన గ్రామ టీడీపీ యూత్ కాపలా కాస్తున్నారు. కాగా, సోమవారం ఎంపీ డీవో విజయరావు, పీఆర్ ఏఈ వేణుగోపాల్, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్, చెయ్యేటి వద్దకు వెళ్లి పరిస్థితులను పర్యవేక్షించారు. అమీరుల్లా యూత్ సభ్యులను అభినందించారు.

కార్యకర్తల అభిమానం మరువలేనిది



కాటిమాయకుంటలో పర్యటిస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల అభిమానం ఎప్పటికీ మరువలేనిదని రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు తెలిపారు. సోమవారం కాటిమాయకుంటలో ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని తెలియజేశారు.

సిమెంటు లారీ బోల్తా..

పుల్లంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై హైవేలోని పుల్లంపేట వద్ద సోమవారం సిమెంటు లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. యర్రగుంట్ల నుంచి సిమెంటు లోడుతో చెన్నైకి వెళుతున్న ఈ లారీ పుల్లంపేట సమీపంలో కారును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వాహనం రావడంతో పక్కకు మళ్లించే యత్నంలో ఈ ప్రమాదం జరిగింది.

'స్థానిక' ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు

● ప్రభుత్వానికి సిద్దవటం జేఏసీ హెచ్చరిక



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

సిద్దవటం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో కొనసాగిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సిద్దవటం జేఏసీ సభ్యులు హెచ్చరించారు. సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లాలో కొనసాగించడాన్ని నిరసిస్తూ వందలాది మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దారు ఆకుల తిరుమలబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విభజన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కడప ముద్దు, రాయచోటి వద్దు నినాదాలు చేశారు. ఇలాగైతే వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఒంటిమిట్ట : కడపకు సమీపంలో ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని వైసీపీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కడప జిల్లాకు ఆధ్యాత్మిక కేంద్రమైన ఒంటిమిట్టను దూరం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి మండలాన్ని రాయచోటిలో కలపాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సురేంద్రారెడ్డి

వీరబల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలాన్ని రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలపాలంటూ వీఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, పెద్దివీడు సర్పంచ్ తాటిగుట్ల నాగిరెడ్డి, తాటిగుంటపల్లి సర్పంచ్ గోఎనాథ్‌రెడ్డి సోమవారం తహసీల్దార్ ఖాజాబీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ అన్నమయ్య జిల్లా సరిహద్దుల్లో ఉన్న వీరబల్లి మండలాన్ని రాయచోటి డివిజన్‌లో కలిపితే అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం రాజంపేటలోని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లేందుకు రెండు ఘాట్ రోడ్లను దాటుకుని సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా మదనపల్లి జిల్లా ఏర్పాటు చేస్తున్న సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి, సుండుపల్లె మండలాలను రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలిపితే ఉద్యోగులకు, మండల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు.

6న రాయచోటిలో ప్రపంచ దివ్యాంగుల ఉత్సవం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న రంగారెడ్డి

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాసాపేటలోని మార్కెట్ యార్డులో డిసెంబర్ 6న ఆంధ్రప్రదేశ్ దివ్యాగుల సంక్షేమ సంఘం (ఏపీడీఎస్ఎస్) ఆధ్వర్యంలో 66వ ప్రపంచ దివ్యాంగుల దినం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా కలె క్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, రాయచోటి మండల తహసీల్దార్, ఎంపీడీవో , మార్కెట్ యార్డు ఛైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులందరూ హాజరై కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

31 నుంచి సీఐటీయూ మహాసభలు

రాయచోటిటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు వైజాగ్‌లో నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జిల్లా కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు ఏవీ రమణ, ఓబుళమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో పోస్టర్లు విడుదల చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్స్‌కు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాధవయ్య, సుహాసిని, సుబ్బమ్మ, దేవా, సిద్దయ్య, నాగరాజు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ దృష్టికి పల్లంపాడు సమస్యలు



సబ్‌కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేస్తున్న పల్లంపాడు వాసులు

పెనగలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింగరాజపురం పంచాయతీ పల్లంపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను సర్పంచ్ సుజాత, సురేష్, గ్రామ పెద్దలు ఆవుల రమణయ్య, మందా సాయి, వి.పల్లయ్య, మందా సుబ్బరాయుడు సోమవారం రాజంపేట సబ్‌కలెక్టర్ భావనకు వివరించి ఆదుకోవాలని కోరారు. పల్లంపాడు గ్రామం చెయ్యేరు, గుంజనేరు మధ్యలో ఉండడంతో వర్షాలు వచ్చినప్పుడు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతుండడంతో నిత్యావసర సరుకుల తెచ్చుకోవడానికి సైతం ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందా సాయికుమార్, వెలగచర్ల మహేష్, ఇ.సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, నగేష్, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న పండుగోల మణి

రైల్వేకోడూరు రూరల్ డిసెంబ రు 1 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి కోరారు. మండలంలోని దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను సోమవారంరైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ దృష్టికి తీసుకొచ్చారు. మాధవరంపోడు, శెట్టిగుంట, చియ్యవరం, ఓబనపల్లె, అనంతరాజుపేట, సూరపురాజుపల్లె, కె. బుడుగుంటపల్లె,రెడ్డివారిపల్లె తదితర గ్రామాల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళిత, గిరిజనులకు చెందిన భూము లను అగ్రవర్ణాల వారు ఆక్రమించారని తెలిపారు. దళిత, గిరిజన గ్రామాలలో సర్వేలు నిర్వహించి శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు సోమవారం తహసీల్దార్ క్రాంతి కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు.ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

మంగంపేట పల్వరైజింగ్ మిల్లుల సమస్య పరిష్కారం

● ఏపీఎండీసీ ఎండీతో ముక్కా రూపానందరెడ్డి చర్చలు సఫలం



ఏపీఎండీసీ ఎండీతో చర్చల్లో ముక్కా తదితరులు

రైల్వేకోడూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మంగంపేట పల్వరైజింగ్ మిల్లుల సమస్య పరిష్కారం చేసినట్లు రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగంపేట పల్వరైజింగ్ మిల్లులకు బెరైటీస్ సరఫరాలో ఏర్పడిన సమస్యలపై విజయవాడలోని ఏపీఎండీసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మిల్లుల యజమానులతో కలసి ఎండీ ప్రవీణ్‌కుమార్‌తో చర్చలు నిర్వహించామని తెలిపారు. స్థానికంగా 120 పల్వరైజింగ్ మిల్లులుండగా వాటికి అవసరమైన రాయి ఇవ్వకపోవడంతో యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా మిల్లుల యజమానులతో పాటు కార్మికులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాయి ఇవ్వడానికి ఎండీ సానుకూలత వ్యక్తం చేయడంతో సమస్యకు పరిష్కారం దొరికిందన్నారు. పరిశ్రమల కార్యకలాపాలకు పునరుద్ధరించుకునే అవకాశం లభించిందన్నారు. దీంతో ఎండీకి కృతజ్ఞతలు తెలిపినట్లు వివరించారు. ఈ చర్చల్లో పల్వరైజింగ్ మిల్లు యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు మాచినేని విశ్వేశ్వరనాయుడు, కూటమి నాయకుడు తల్లం వెంకటరమణారెడ్డి, కల్ల చలపతి, పల్వరైజింగ్ మిల్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

కరవు గడ్డలో కృష్ణమ్మ గలగలలు...

- నిరాటంకంగా కొనసాగుతున్న ప్రవాహం
- మూడు టీఎంసీలు..123 చెరువులు పూర్తి
- మరో వంద చెరువులు నింపేలా ప్రణాళిక
- ఫిబ్రవరి వరకు జలాలు కొనసాగే అవకాశం
- తాగు, సాగునీటికి తప్పిన ఇబ్బందులు

మదనపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను సస్యశ్యామలం చేసే హంద్రీ-నీవా కల సాకారం అవుతోంది. మొదటి, రెండో దశ పనులు పూర్తయి, మొదటిసారిగా కృష్ణమ్మ ప్రవాహం మొదలైన 2018 నుంచి తీసుకుంటే ఈ ఏడాదిలో ఇప్పటికే రికార్డు స్థాయిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విచ్చేసింది. హంద్రీ-నీవా పథకం ప్రారంభించినప్పటి నుంచీ నీరు పారించడం వరకూ అపర భగీరథునిగా రికార్డు సొంతం చేసుకున్న సీఎం చంద్రబాబునాయుడు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. పట్టువదలని విక్రమార్కుడిలా పనులు పూర్తి చేయించి అనుకున్న లక్ష్యం చేరుకున్నారు. భౌగోళికంగా ఎక్కడో ఉన్న శ్రీశైలం నుంచి మరెక్కడో ఉన్న కుప్పం వరకు 750 కి.మీ. దూరం కృష్ణమ్మను తీసుకెళ్లడంలో సఫలీకృతమయ్యారు. కరువుగడ్డను సస్యశ్యామలం చేస్తున్నారు. పుంగనూరు బ్రాంచీ కెనాల్ ప్రారంభమయ్యే కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి ఆగస్టు 17వ తేదీ కృష్ణమ్మ ప్రవాహం మొదలైన ఏడు రోజుల్లోనే కుప్పం చేరుకుంది. అక్కడక్కడా చిన్నపాటి అడ్డంకులు, అవరోధాలు మినహా రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరాటంకంగా సాగుతోంది. ఎన్నడూ లేని విధంగా, ఎవరూ కలలో కూడా ఊహించని కృష్ణా జలాల గలగలలు, పరవళ్లు చూసిన రైతులు, ప్రజల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. మొదటగా కుప్పానికి వెళ్తున్న కృష్ణమ్మను మధ్యలో ఆహ్వానిస్తూ చిన్నపాటి కుంటలు, చెరువులు నింపుకోవడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. మొదట్లో అడ్డంకులపై ఆంక్షలు విధించిన అధికారులు, ఆ తర్వాత చూసీచూడనట్లు ఉండిపోతున్నారు. ఫలితంగా మార్గమధ్యలో అనధికారికంగా మరిన్ని చెరువులు నిండుతున్నాయి.

హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి పుంగనూరు, కుప్పం బ్రాంచీ కెనాల్‌కు ఆధారమైన చెర్లోపల్లెకు 500 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా, అక్కడి నుంచి పుంగనూరు బ్రాంచీ కెనాల్ మొదలయ్యే 75 కి.మీ. వద్ద ఔట్‌ఫ్లో 350 క్యూసెక్కులు ఉంది. ఇందులో చెర్లోపల్లెకు ముందు భాగాన ఎనిమిది, ఆ తర్వాత పుంగనూరు బ్రాంచీకెనాల్‌పై మరో ఎనిమిది ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ప్రతి సంపులోనూ మూడు మోటార్లు పనిచేస్తున్నాయి. ఇలా సత్యసాయి జిల్లా దాటి అన్నమయ్య జిల్లా పీటీఎం మండలంలో ప్రవేశానికి 300 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. అలాగే కుప్పం బ్రాంచీ కెనాల్ మొదలయ్యే పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వద్ద 230 క్యూసెక్కులతో మొదలైన ప్రవాహనం కుప్పానికి 160 క్యూసెక్కులు వెళ్తోంది. ఇలా ఇప్పటికే పరమసముద్రంచెరువు, వీరప్పనాయుని చెరువుతో 80 చెరువులు నిండిపోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముఖ్యంగా పడమట కృష్ణమ్మ పరవళ్లతో కరవుగడ్డ పులకిస్తోంది. చెరువుల కిందనే కాదు..కాలువల్లో ప్రవాహంతో భూగర్భజలాలు మరింత పెరిగాయి. ఇక సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పినట్లేనని రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీ-నీవా చరిత్రలో మొదటిసారిగా కుప్పానికి కృష్ణా జలాలు తీసుకెళ్లడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. 2018 నుంచి ఇప్పటి వరకూ గతేడాది మినహా ప్రస్తుతం ఏడోసారి వస్తున్న ప్రవాహం రికార్డు స్థాయికి చేరింది. ఇప్పటి వరకు సాగిన ప్రవాహం విడతల్లో మూడు నెలల సీజన్‌లలో 0.60 టీఎంసీకి మించలేదు. ప్రస్తుతం మూడు నెలలకే మూడు టీఎంసీలకు పైబడిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జనవరి నాటికి మరో రెండు టీఎంసీలు, ఫిబ్రవరి చివరికి మరో టీఎంసీలతో కలిపి మూడు టీఎంసీలు తరలించాలని అధికారులు భావిస్తున్నారు. మదనపల్లె హంద్రీ-నీవా సర్కిల్ పరిధిలోని ఎస్ఈ విఠల్‌ప్రసాద్ ఆధ్వర్యంలోని ఈఈ, డీఈల బృందం ముమ్మర ప్రయత్నం చేస్తోంది. కాలువ వెంబడి లైనింగ్ కూడా 70 శాతం పూర్తి కావడంతో ప్రవాహం కూడా సెకనుకు 40-50 సెంటిమీటర్ల చొప్పున రోజుకు 20 కి.మీ. సాగుతోంది. దీనికితోడు విడతల వారీగా కురుస్తున్న వర్షాలు కూడా కలిసొచ్చాయనే చెప్పాలి. ఇప్పటికీ కృష్ణమ్మ 300-350 క్యూసెక్కుల సామర్థ్యంతో ముందుకెళ్తోంది. ప్రస్తుత పరిస్థితులను లెక్కిస్తే, జనవరి నెలాఖరు వరకూ అదే సామర్థ్యంతో ప్రవాహం కొనసాగనుంది. డిసెంబరులో వర్షాలు బాగా కురిస్తే ఫిబ్రవరి చివరి వరకూ కృష్ణమ్మ పరవళ్లు కొనసాగనున్నాయి.

అనంతపురం జిల్లా జీడి పల్లె రిజర్వాయరు నుంచి వచ్చే ప్రవాహం ఆగిపోయినా..ప్రస్తుతం చెర్లోపల్లె రిజర్వాయర్‌లో నిలకడగా కొనసాగే 1.60 టీఎంసీల నీటిలో ఒక టీఎంసీని తీసుకోవచ్చు. ఆ నీరు కూడా నెలన్నర రోజుల ప్రవాహం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని పరిస్థితులు అనుకూలిస్తే ఆలోగానే ఆరు నియోజకవర్గాల్లోని అన్ని చెరువులను నింపే అవకాశం ఉంది. పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్ పరిధిలోని కదిరి, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 2025-26 ఏడాదిలో మొత్తం 202 చెరువులు నింపాలని ప్రతిపాదించారు.


హంద్రీ-నీవా కాలువ నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్న మోటార్లు


కృష్ణా జలాలతో నిండుతున్న సీటీఎం పెద్దచెరువు

	చెరువులు	నింపినవి	కొంత నింపినవి	నింపనున్న చెరువులు
పలమనేరు				
బ్రాంచ్ కెనాల్	80	46	15	27
కదిరి	04	00	00	04
తంబళ్లపల్లె	52	34	07	13
మదనపల్లె	10	03	04	05
పుంగనూరు	09	02	03	06
పలమనేరు	05	06	00	00
కుప్పం				
బ్రాంచ్ కెనాల్	122	90	26	16
పలమనేరు	35	32	07	01
కుప్పం	87	58	19	15

అనుకున్న లక్ష్యాలు సాధిస్తాం



ఈ ఏడాదిలో నిర్దేశిత చెరువులన్నీ కృష్ణా జలాలతో నింపుతాం. ఇప్పటికే సగానికి పైగా పూర్తి చేశాం. మిగిలిన వాటినీ వచ్చే రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తాం. కరువు గడ్డ సస్యశ్యామలం కాబోతోంది. ఈ ఏడాదికి ఆరు టీఎంసీలు తీసుకున్నా.. వచ్చే ఏడాది నాటికి పెండింగ్ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయి వాటాను వాడుకునేలా చర్యలు చేపడుతున్నాం. పీబీసీపై అక్కడక్కడ లైనింగ్‌తో పాటు కాంక్రీటు నిర్మాణాలు కొన్ని చేపట్టాల్సి ఉంది. వాటిని పూర్తి చేయడంపై దృష్టి సారించాం. వీటి నిర్మాణంతో పాటు ఈ ఏడాది ఎదురైన అడ్డంకులు, అవరోధాలను అధిగమిస్తాం.

- ఆర్.విఠల్‌ప్రసాద్, ఎస్ఈ, హంద్రీ-నీవా సర్కిల్, మదనపల్లె

త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి

అధికారుల సమావేశంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ 45 రోజుల కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు 987 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో వాటిలో 961 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని, మిగిలిన 26 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి పెట్టుబడి రాయితీ, ఉత్పాదక, సేవా రంగాల్లోని 27 యూనిట్లకు రూ.57.88 లక్షల విలువైన రాయితీల ప్రయోజనాలను కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కృష్ణకిశోర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, ఏపీఐఐసీ, జిల్లా రవాణాశాఖ అధికారి, విద్యుత్‌శాఖ అధికారి, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల అసోసియేసన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గుర్రంకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లోని హుండీలను టార్గెట్ చేసి దొంగతనం చేస్తున్న ముగ్గురిని సోమవారం అరెస్టు చేసినట్లు వాల్మీకీపురం సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పలు ఆలయాల్లో హుండీల చోరీలు జరిగాయి. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో గుర్రంకొండ ఎస్ఐ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అమిలేపల్లె క్రాస్ వద్ద ముగ్గురిని పట్టుకొని విచారించగా దేవాలయాల్లో హుండీ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారన్నారు. మదనపల్లెకు చెందిన బాలాజీ (45), నిమ్మనపల్లెకు చెందిన బాలు (20), పెద్దపంజాణికి చెందిన రమేశ్ (29) జిల్లాలోని వాల్మీకీపురం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని పలు ఆలయాల్లో హుండీ చోరీ కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి 250 గ్రాముల వెండి కిరీటం, 25 కిలోల రాగి వైరు, 10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సెల్‌టవర్ కంట్రోల్‌రూంలో అగ్నిప్రమాదం

మంటలను ఆర్పిన అగ్నిమాపక శాఖ సిబ్బంది


సెల్‌టవర్ కంట్రోల్‌రూంలో మంటలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం నేతాజీ కాలనీలోని ఎయిర్‌టెల్ సెల్ టవర్ వద్ద అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో సెల్ టవర్ కంట్రోల్‌రూంలో మంటలు వ్యాపిస్తుండటంతో స్థానికులు గమనించి మదనపల్లె అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ ఫైర్ ఆఫీసర్ శివన్న తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా కంట్రోల్‌రూంలోని బ్యాటరీల్లో కొన్ని పేలడంతో మంటలు ఎగసిపడి కంట్రోల్ రూం మొత్తం అగ్నికి ఆహుతైంది. లోపల ఉన్న బ్యాటరీలు అన్నీ పగలకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ప్రమాదంలో పెద్దఎత్తున ఎయిర్‌టెల్ కంట్రోల్ రూంలో నష్టం వాటిల్లి ఉంటుందంటున్నారు. ప్రమాదంతో ఎయిర్‌టెల్ మొబైల్ సర్వీసులన్నీ పనిచేయలేదు.

కృష్ణా జలాలతో చెరువులు నింపుతాం : ఎమ్మెల్యే


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అధికారులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో సప్లై చానెళ్లు సరిగ్గా లేని చెరువులను కృష్ణా జలాలతో నింపుతామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మండలంలోని వడ్డిపల్లె వద్ద హంద్రీనీవా జలాలను సింఫోనిక్ పద్ధతిలో దిగువన వున్న సప్లై చెరువులకు వదులుతున్న సందర్భంగా ఎమ్మెల్యే జలహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బసినికొండ, వలసపల్లె పంచాయతీల్లోని చెరువులకు హంద్రీనీవా నీటిని వదులుతామన్నారు. అదే విధంగా ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం పూర్తికి రూ.12 కోట్లు నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, జలవనరులశాఖ ఏఈ రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నవీన్‌చౌదరి, టీడీపీ నాయకులు బాలుస్వామి, కత్తి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు


తుఫాను ప్రభావంతో తోటలోనే రాలిపోయిన టమోటాలు


మిరప పంటకు సోకిన కుళ్లు తెగులు

రామసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా పడుతున్న చిరు జల్లులతో పలు పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా టమోటాలు, పిందెలు, పూత రాలిపోయింది. దీంతో పాటు లేత దశలోని టమోటా మొక్కలకు పలు తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. టమోటా ధరలు కొన్ని రోజులుగా ఆశాజనకంగా ఉండగా వర్షంతో పంట నష్టం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప పంటకు కాయలపై కుళ్లు తెగులు సోకడంతో పంట చాలా వరకు దెబ్బతింది. సీజనల్ పంట అయిన అనప పంట ముసురు వర్షంతో చీడపీడలు సోకి పూత రాలిపోయింది.

అలాగే కొత్తమీర, కాలిఫ్లవర్, బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగింతే కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మదనపల్లె మండలం సీటీఎం గ్రామం మిట్టపల్లెకు చెందిన రవీంద్రారెడ్డి (39) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగి ఈశ్వరమ్మ కాలనీలోని రైస్ మిల్ వద్ద అపస్మారస్థితిలో ఉండగా స్థానికులు గుర్తించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో మరో యువకుడు..

మదనపల్లె పట్టణానికి చెందిన యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ సమస్యలతో మనస్థాపం చెందిన పట్టణంలోని బాలాజీ కాలనీకు చెందిన సుభాష్ (25) విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దేవదాయ ఆస్తుల అక్రమాలపై విచారణ

ఈవో మునిరాజపై శాఖాపరమైన చర్యలు?

బి.కొత్తకోట. డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ పరిధిలోని పలు ఆలయాల భూములు, ఆస్తుల నిర్వహణలో అనేక అక్రమాలకు పాల్పడిన ఈవో మునిరాజపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు ఫిర్యాదుదారుడికి సమాచారం వచ్చింది. చెన్నకేశవస్వామి మాన్యం భూమిని సాగు కోసం లీజుకు తీసుకొని రూ.కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తోడేశారని, విలువైన భూమి ధ్వంసమై ఎందుకూ పనికిరాకుండా పోయిందని, ఇందులో దేవాదాయశాఖ ఈవో మునిరాజ ప్రమేయంపై విచారణ చేయాలని బి.కొత్తకోటకు చెందిన చిట్టారామక్రిష్ణారెడ్డి లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక విచారణాధికారిగా ఆర్ఎస్ రంగాపురం, మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈవో, నంద్యాల డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులును నియమించారు. సోమవారం ఆయన బి.కొత్తకోటకు వచ్చి విచారణ చేపట్టారు. ఈవోపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ లోకాయుక్త ద్వారా సమాచారమిచ్చారు. అయితే దీనిపై రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కమిషనర్ తీసుకున్న నామమాత్రపు చర్యలు ఏమాత్రం సరిపోవని, అవినీతి చేసే అధికారులకు గుణపాఠం చెప్పేలా చర్యలు ఉండాలని, దీనిపై మళ్లీ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వామికి వెండి కిరీటం బహూకరణ

వేంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని కడప బైపాస్‌రోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి ఆలయానికి స్థానిక భక్తుడు రవిశేఖర్ వెండి కిరీటాన్ని బహూకరించారు. లక్ష రూపాయల విలువైన వెండి కిరీటాన్ని అయ్యప్పస్వామి ఆలయ నిర్వాహకులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వెండి కిరీటాన్ని తీసుకెళుతున్న భక్తుడు రవిశేఖర్

హోంగార్డు కుటుంబానికి

సహచరుల ఆర్థిక సాయం


హోంగార్డు కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి సహచరులు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వై.పవన్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు జిల్లా హోంగార్డులు ముందుకొచ్చారు. తమ ఒకరోజు డ్యూటీ అలవెన్సును స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారు. దీంతో మొత్తం రూ.2.30 లక్షలు సమకూర్చి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎస్పీ ద్వారా కుటుంబానికి అందజేశారు. చెక్కును ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మరణించిన హోంగార్డు తల్లి వై.రాధకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహచరులను కోల్పోవడం మా పోలీసు కుటుంబానికి చాలా బాధాకరమని, హోంగార్డు పవన్‌కుమార్‌రెడ్డి మరణం మాకు వ్యక్తిగత నష్టం అని, ఇలాంటి సందర్భాల్లో సహచరులు అండగా నిలవడం గొప్ప సంప్రదాయం అన్నారు. పోలీసు విభాగం ఎల్లప్పుడూ బాధిత కుటుంబంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ పెద్దయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, ఏఆర్ఎస్ఐ బాలాజీ, బాధిత కుటుంబ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నారు.

క్వారీ వాహనాలతో రోడ్లు గుల్ల..

సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు


సబ్‌కలెక్టర్ కళ్యాణికి ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోటవారుపల్లె వద్ద క్వారీ వాహనాలతో గ్రామీణ రోడ్లు, పంట పొలాలు నాశనం అవుతున్నాయని ఆ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి చాంబర్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటవారుపల్లె సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సర్పంచ్‌లు నారాయణ స్వామి, సొక్కం సత్యనారాయణ మాట్లాడుతూ కోటవారుపల్లె చుట్టుపక్కల 16 క్వారీలు ఉండగా ఇక్కడి నుంచి వచ్చే భారీ వాహనాలతో మూడు గ్రామాలకు వెళ్లే దారులన్నీ ధ్వంసం అయ్యాయన్నారు. జనమిత్ర క్వారీ నుంచి వచ్చే వాహనాలు హంద్రీనీవా కాలువ కట్టపై వెళుతుండటంతో కట్ట దెబ్బతింటోందన్నారు. దీనిపై విచారించి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు. పోలీసుల పేరుతో తనను వేధిస్తున్నారని, గుట్కా కేసులు పెడతామని ఆరుగురు మొబైల్ ఫోన్లతో కాల్ చేసి బెదిరిస్తున్నారంటూ నీరుగట్టువారిపల్లెకు చెందిన బాలకృష్ణ ఫిర్యాదు చేశాడు. వీటితో పాటు 18 మంది వివిధ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

మద్యం విక్రేత అరెస్టు

గుర్రంకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ గొల్లపల్లె క్రాస్ వద్ద బెల్టుషాపుపై దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తితో పాటు 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులపై ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగ్గురిపై వేధింపుల కేసు

కలకడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, అత్తమామపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎర్రయ్యగారిపల్లెకు చెందిన రెడ్డిలక్ష్మీకి సోమల మండలం ముడియంవారిపల్లెకు చెందిన వెంకటేశ్‌తో 2015లో వివాహం జరిగిందన్నారు. తిరుపతి స్విమ్స్‌లో ఉద్యోగం చేస్తున్న రెడ్డిలక్ష్మీ 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చిందని, దీంతో భర్త వెంకటేశ్, అత్త సుశీల, మామ శ్రీనివాసులు ఎర్రయ్యగారిపల్లెకు వచ్చి అదనపు కట్నం కోసం వేధించారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలిలా ఉన్నాయి. ఓబుళవారిపల్లె మండలం బాలిరెడ్డిపల్లెకు చెందిన సిరిగిరి గంగమ్మ రాఘవరాజపురం గ్రామం వద్ద కారు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కోడూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో మల్లికార్జున స్వామి

తంబళ్లపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుఫాను ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నా సోమవారం ఉదయమే పలు ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు చేరుకుని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు కొండపైన ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అరటికి.. సిగటోక తెగులు



సిగటోక తెగులు సోకిన అరటి పంట

● అవగాహన లేక నష్టపోతున్న రైతులు ● నివారణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు ● ఉద్యాన అధికారుల సూచనలు

లింగాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అరటి పంటను సిగటోక ఆకు మచ్చ తెగులు పట్టిపీడిస్తోంది. గెల వేయకముందు తెగులు సోకితే చెట్టు పెరుగుదల మందగించి దిగుబడులు తగ్గిపోతాయి. గెలవేసిన తర్వాత సోకితే కాయలు సరైన సైజు రావు. పక్వానికి రాకముందే కాయలు మాగిపోతాయి. చాలా మంది రైతులకు సిగటోకా తెగులుపై సరైన అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారు.

పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా అరటి పంటను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతం రైతులకు కొన్ని సంవత్సరాల నుంచి అరటి పంట ప్రధాన ఆదాయ వనరుగా మారింది. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 26,418 ఎకరాలలో అరటి పంటను రైతులు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం అరటి పంటకు సిగ టోక ఆకుమచ్చ తెగులు వాపిస్తోంది. దీంతో చాలా మంది రైతులు పురుగుల మందుల దుకాణాలలో ఇచ్చే మందులను పిచికారీ చేస్తు న్నారు. పూర్తి స్థాయిలో నివారణ పద్ధతులు పాటించడం లేదు. తెగులు సోకినపుడు రైతులు ప్రధానంగా కెమికల్ మందుల పిచికారీ చేసేందుకే మొగ్గుచూపుతున్నారు. కానీ జీవ శిలింద్రాల నాశనులను ఉపయోగించడం లేదు.



తెగులుతో ఎండిపోయిన ఆకు



సరైన నియంత్రణ పద్ధతులు చేపట్టాలి

అరటిలో సిగోటక ఆకుమచ్చ తెగులు సూడోసరోకస్పోరమ్యూజె అనే శిలీంద్రం ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉన్నపుడు, పగటిపూట ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు, వర్షం కురిసినపుడు వేగంగా చెట్టు అంతా వ్యాప్తి చెంది బలమైన గాలులు వీచినపుడు లైంగిక సిద్దబీజాలు ఒక తోట నుంచి మరో తోటకు వ్యాపించి తెగులు ఉధృతం అవుతుంది. గెలవేసిన తర్వాత ఉపయోగించాల్సిన మందులు అజాక్సీస్ట్రోబిన్ 1 ఎంఎల్, అజాక్సీ స్ట్రోబి న్+డైఫెనాకొనాజోల్ 0.5 ఎంఎల్, అజాక్సీస్ట్రోబిన్+టేబుకొనాజోల్ 1ఎంఎల్, టేబుకొనాజోల్+ట్రైప్లాక్సీస్ట్రోబిన్ 1గ్రా, పైరాక్లోస్ట్రోబిన్+ ఏపాక్సీకొనాజోల్ 1.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి ఉపయోగించాలి. అలాగే గెల వెయక ముందు తెగులు సోకితే కార్బండి జం+ మాంకోజెబ్ 1.5గ్రాము, ప్రొఫికొనాజోల్ 1ఎంఎల్, క్లోరోథలోనిల్ 2గ్రా, డైఫెనా కొనాజోల్ 1ఎంఎల్, ప్రొఫికొనాజోల్+డైఫెనాకొనాజోల్ 1ఎం ఎల్, క్లోరోథలోనిల్+డైఫెనా కొనాజోల్ 2ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి 15రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.

చెడు శిలీంద్రాలను నాశనం చేస్తే ...

జీవ వ్యవసాయం (బయాలాజికల్ ఫార్మింగ్) కెమికల్ మందులను మాత్రమే కాకుండా జీవశిలీంద్ర నాశనులు అయిన ట్రైకోడర్మావిరిడి 5ఎంఎల్, బాసిల్లాస్ సబ్‌స్టిలిస్ 10ఎంఎల్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ 5ఎంఎల్, వేపనూనెను ఉపయోగించి ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. డ్రిప్‌ద్వారా కూడా చెడు శిలీంద్రాలను నాశనం చేస్తే నేలను ఆరోగ్యవంతంగా చేసి మొక్క ఆరోగ్యంగా పెరిగి, మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంది.

-రాఘవేంద్రరెడ్డి, ఉద్యాన అధికారి, పులివెందుల.



సిగటోక తెగులుపై రైతులకు శిక్షణ

అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తుండడతో నివారణ చర్యలు చేపట్టేందుకు ఉద్యాన శాఖ అధికారులు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఇప్పట్ల గ్రామంలో సోమవారం పులివెందుల అరటి పరిశో ధన స్థానం శాస్త్రవేత్త శిరీష సిగటోక తెగులు వ్యాప్తి, చేపట్టాల్సిన నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం తుఫాన్ వలన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత యూరియ, పొటాష్ ఎరు వులను డ్రిప్ ద్వారా అందించాలని సూచించారు. పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ అరిటి గెలకు తొడ గులు వేసిన రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీ మంజూరు చేస్తోందని వివరించారు.

మహిళా రైతు సంఘాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ప్రకృతి వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడులను పొందాలి : పీడీ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతు సంఘాలు అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం వార్షిక మహాసభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గతంలో మహిళా సంఘాలు ఉండేవని, అయితే ప్రభుత్వం ప్రస్తుతం మహిళా రైతు సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేస్తోందన్నారు. పంట పొలాల్లో మందులు పిచికారి చేసుకోవడానికి ప్రభుత్వ సబ్సిడీతో డ్రోన్లు రైతు సంఘాలకు ఇస్తోందని, ఆసక్తి ఉన్న మహిళా సంఘాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్ నిధులు, ఎస్టీఎఫ్‌సీ నిధులు, స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళా సంఘం సభ్యులు ఖచ్చితంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని.. వచ్చే డబ్బులతో కంతులు చెల్లించుకుంటూ కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలని పీడీ తెలిపారు. అనంతరం ఆమె స్థానికంగా ఉన్న మహిళా పాలడెయిరీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో రామచంద్రారెడ్డి, వెలుగు ఏపీయం చిన్న ఓబులేసు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సీతారామిరెడ్డి, బాలయ్య, నారాయణ, సుబ్బరాయుడు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, గ్రామ సంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే ఉండేలా సీఎం దృష్టికి...



ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలోనే ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆ మం డలాల ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకోగా వారితో కలిసి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ బయట శ్రీనివాసరెడ్డి పాత్రికేయులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను అశాస్త్రీయంగా రాజకీయ కుట్రతో విడగొట్టిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా శాస్త్రీయంగానే కాకుండా ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులను సైతం గుర్తించిన తర్వాతే రాష్ట్రంలో కొత్తగా మదనపల్లి, మార్కాపురం జిల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం కడపకు అత్యంత సమీపంలో వున్న సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లాలో చేర్చడం వలన ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఆ రెండు మండలాల ప్రజలు ఆకాంక్షలకు తగినట్లు కడప జిల్లాలోనే ఉండేలా చూడాలని కోరతామన్నారు. కార్యక్రమంలో పలువురు ఆయా మండలాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈనెల 15లోపు పంటల బీమా చెల్లించండి

పులివెందుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే వివిధ రకాల పంటలకు ఈనెల 15లోపు బీమా చెల్లించాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రబీలో పండించే వివిధ రకాల పంటలు నువ్వులు, వేరుశనగ, పెసర, జొన్న, మినుము, వరి, ప్రొద్దుతిరుగుడు, శనగ పంటలకు సంబంధించి రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. ఆధార్‌కార్డు, భూమి పత్రం, కౌలు రైతుల ధ్రువీకరణపత్రం, పంట సాగుచేసినట్లు సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా జారీ అయిన పత్రం, బ్యాంకు ఖాతా వివరాలు సంబంధిత మీసేవ కేంద్రాలలో అందించి ప్రీమియం చెల్లించాలన్నారు.

ప్రీమియం ఎకరాలలో : నువ్వులు రూ.180, వేరుశనగ రూ.480, పెసర రూ.270, జొన్న రూ.315, మినుము రూ.285, వరి రూ.630, ప్రొద్దుతిరుగుడు రూ.300, శనగ రూ.480 చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శిక్షణ

● డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మారుతున్న టెక్నాలజీ రంగంలో విద్యార్థులు మరింత నిష్ణాతులు కావాలంటే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈ కేంద్రం ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. అంతర్జాతీయ సంస్థలైన ఐబీఎం శాస్త్రవేత్తలు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్లు, డాటా టెక్ ఏఐ సి-డాక్ నుంచి నిష్ణాతులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇప్పటికే 150 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసు కున్నారని, ఇతర సంస్థల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఏఓ రవికుమార్, అధికారులు రత్నకుమారి, భాస్కరయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఏసీఏ అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు



అక్షిత్‌రెడ్డి, దీక్షిత్

కడప స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా మారాయి. ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ - సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. ఇందులో ఎస్.ఎం.ఇజహర్ 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్‌కు దిగే సమయానికి వెలుతురు సరిగా లేకపోవడంతో ఆటను నిలిపేశారు.

కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నార్త్‌జోన్ విన్నర్స్-సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన సెంట్రల్ జోన్ విన్నర్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. ఇందు లో అక్షిత్‌రెడ్డి 137 పరు గులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయా నికి ఒక్క ఓవర్ ఆడి వికెట్ నష్టపోకుండా పరు గుల ఖాతా తెరవలేదు.

కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు- రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 69.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో సాయికృష్ణచైతన్య 88 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు బౌలర్ దీక్షిత్ 5 వికెట్లు పడగొట్టాడు. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అప్పటికి వెలుతురు సరిగా లేని కారణంగా ఆటను నిలుపుదల చేశారు.

విద్యార్థి సామాజిక స్పృహ...



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ స్కూలు విద్యార్థి ఎబినేజర్

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం రెండవ వార్డు స్కూలు వెనకాల వున్న మడూరు కాలువకు రక్షణ గోడలు లేక తన మిత్రుడు సైకిల్ మీద వెళుతూ కాలువలో పడ్డాడు. ఆ పరిస్థితి ఎవ్వరికీ రాకూడదని మున్సిపల్ హైస్కూలుకు చెందిన 6 వతరగతి విద్యార్థి ఎబినేజర్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. సోమవారం ఎబినేజర్ తన తండ్రితో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు కాలువకు రక్షణ గోడలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాలువకు రక్షణ గోడలేక తన స్నేహితుడు సైకిల్ మీద వెళుతూ కాలువ పడ్డాడని.. అక్కడ చూసిన వారంతా కలిసి ప్రాణాలతో కాపాడగలిగారని.. లేకుంటే పరిస్థితి ఏమిటని ఆ విద్యార్థి ఆవేదన చెందారు. ఈ విషయం తన తండ్రి దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకారంతో ఇక్కడి వచ్చానని తెలిపారు. ఇందుకు కమిషనర్ రవిచంద్రారెడ్డి విద్యార్థి ఎబినేజర్‌కు వున్న సామాజిక స్పృహకు మెచ్చుకున్నారు. తక్షణం కాలువకు రక్షణ గోడలు కట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉద్యాన పంటల్లోకి వర్షం నీరు

● మూడు రోజులుగా జడివాన ● కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు





తెగిపోయిన రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు, వర్షం నీటితో నిండిపోయిన అరటితోట

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న జడివానతో ఉద్యానపంటల్లోకి వర్షం నీరు చేరింది. అరటి, మామిడి తోటల్లోకి వర్షం నీరు చేరి పొలాల్లోకి రైతులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అరటి తోటల్లోకి భారీగా నీరు చేరడంతో చెట్లు పడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వరద నీటి ప్రవాహనికి రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మధ్య ఉన్న తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఆయా గ్రామాలకు ప్రజల రాకపోకలు స్తంభించాయి.

రైల్వేకోడూరు చుట్టూ ఉన్న గుంజన, ముష్టేరు, గుండాలేరు, తిరుపతి ఏరు, మేకలగుంతేరు తదితర నదులు వరద నీటితో ప్రవహిస్తున్నాయి. మూడు రోజుల నుంచి జడివాన పట్టడంతో అరటి, నర్సరీ, భవన నిర్మాణ కూలీలు తదితరులకు పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వర్షం నీటితో వరినార్లు నిండిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ పత్రాలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారన్నారు. అరుణప్రభ, జి.అంకమ్మ, ఎం.మల్లికార్జున, చిగురుపాటి నాగ మణి, రామేశ్వరం చిన్నయ్య, ఎస్.అజ్మతుల్లాఖాన్, తుంగా విజయలక్ష్మి, అవ్వారు శ్రీలేఖ దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. నామినేషన్ పత్రాలను మంగళవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు కడప మున్సిపల్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో పరిశీలిస్తారన్నారు.

ఆదాయం ఫుల్... రైళ్లు నిల్

● ముద్దనూరులో రైళ్ల స్టాపింగ్ లేక ఇక్కట్లు



ముద్దనూరు రైల్వే స్టేషన్



ముద్దనూరు రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ వ్యాగిన్‌కు తరలించేందుకు నిల్వ చేసిన తెల్ల కంకర

ముద్దనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ముద్దనూరు రైల్వే స్టేషన్ చూడటానికి రైల్వే జంక్షన్‌ను తలపిస్తోంది. ఈ రైల్వేస్టేషన్ గుండా ఆర్టీపీపీకి ప్రత్యేక లైను నుంచి బొగ్గు రవాణా జరుగుతుంది. అంతేకాకుండా పులివెందుల ప్రాంతం నుంచి తెల్ల కంకర భారీ ఎత్తున గూడ్స్ వ్యాగిన్‌ల ద్వారా తరలిస్తుంటారు. అలాగే ప్యాసింజర్ రైళ్లకు రిజర్వేషన్, తత్కాల్ టికెట్‌ల ద్వారా ఆదాయ వనరులు ఉన్నా ఇక్కడ స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు వెంకటాద్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే ఆపుతున్నారు. ధర్మవరం, దాదర్, మెయిల్ రైళ్లకు స్టాపింగ్ లేకున్నా దాదాపు 100 టికెట్లు రిజర్వేషన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముద్దనూరు, తొండూరు, పులివెందుల ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు గుంటూరు, విజయవాడ వెళ్లాలంటే ధర్మవరం-విశాఖపట్నం రైలు మాత్రమే ఉంది. ముద్దనూరులో స్టాపింగ్ లేకపోవడంతో ఎర్రగుంట్ల వెళ్లాల్సి వస్తోంది. రాత్రి పూట బస్సులు కూడా తక్కువగా ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఏళ్ల తరబడి ముద్దనూరుకు ప్రత్యేకించి వ్యాపార నిమిత్తం నిమ్మ కాయల లోడు కోసం చైన్నైకి వెళ్లేందుకు నిలబడుతున్న మెయిల్, దాదర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కరోనా తరువాత స్టాపింగ్ లేదని వ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల స్టాపింగ్ విషయమై ఈ ప్రాంత నాయకులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ముద్దనూరు రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వసంతపేట వీధిలోని బుశెట్టి కల్యాణ మండపం వద్ద సోమవారం డ్రైనేజీలో పూడిక తీస్తుండగా బండల కింద మృతదేహం బయటపడింది. దీంతో స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని పరిశీలించి.. సంఘటనా స్థలంలో ప్రభుత్వ వైద్యుల చేత పోస్టుమార్టం నిర్వహించారు. ఆ మృతదేహం కాలువలో పడి దాదాపు నెలరోజులకు పైబడి వుంటుందని వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడు ఈశ్వర్‌రెడ్డినగర్‌లో 40 రోజుల కిందట అదృశ్యం అయిన బలిమెల సూర్యనారాయణగా గుర్తించారు. ఈ విషయం వారి కుటుంబం సభ్యులకు తెలియజేయగా, మృతదేహంపై వున్న బట్టలు, ఇతర వస్తువుల ద్వారా బలిమెల సూర్యనారాయణగా అతని భార్య రమాదేవి నిర్ధారించారు, వృత్తిరీత్యా అతను నెలల తరబడి లైన్‌మీద పోతుంటారని, ఒక్కోసారి నెల రోజులకు కూడా ఇంటికి రాడని తెలిపారు. కాగా అతను వసంతపేటలోని మద్యం దుకాణంలో తాగి అక్కడే కాలువలో పడి పోయివుండవచ్చని, మృతదేహం బండల కిందికి వెళ్లడంతో ఇన్నాళ్లు ఎవ్వరూ గుర్తించలేదని స్థానికులు వెల్లడించారు.



మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు


ఆదర్శ ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రోగులకు దుప్పట్ల పంపిణీ


తంబళ్లపల్లెలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


వాల్మీకిపురం మండలం చింతపర్తిలో..



ములకలచెరువులో..

నివారణ ఒక్కటే మార్గం

● ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన ర్యాలీలు ● ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని వైద్యుల పిలుపు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ శివపార్వతిదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రెడ్డెప్పరెడ్డి తెలిపారు. మదనపల్లెలో సోమవారం పలుచోట్ల ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివపార్వతిదేవి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధికాదని, శారీరక సంపర్కం ద్వారా మాత్రమే వ్యాపిస్తుందని తెలిపారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే మదనపల్లె జిల్లా ఆస్పత్రి వద్ద జనచేతన, ఐసీటీసీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ, స్వచ్ఛంద సంస్థలు, కళాశాల విద్యార్థులతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఆర్టీ మెడికల్ సెంటర్‌లో ఆదర్శ ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహకురాలు మేరీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేసి హెచ్‌ఐవీ బాధితులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నర్సింగ్ అధ్యాపకురాలు చంద్రకళ, శ్రీదేవి, మాలతి, ఆర్‌ఎంవో డాక్టర్ సయ్యద్ సుకూర్, ఐజీటీసీ కౌన్సిలర్ జయకుమార్, పోలీస్ స్పెషల్ బ్రాంచ్ రామమూర్తి, జనచేతన డైరెక్టర్ దేవదానం, రిటైర్డ్ డీసీహెచ్ డాక్టర్ పాల్‌రవికుమార్, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ హుమన్‌బాషా, డాక్టర్ మేఘన, జయకుమార్, శ్రీదేవి, వేమనారాయణ, మోహన, ఉషశ్రీ, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనకు విద్యార్థులు సమష్టిగా పోరాడాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకుడు గురుమూర్తి అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఎస్ సంస్థ, ఏపీసాక్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కూడా ర్యాలీ నిర్వహించారు.

సురక్షిత శృంగారంతో భవిష్యత్తు బంగారం

నిమ్మనపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సురక్షిత శృంగారంతో భవిష్యత్తు బంగారంగా ఉంటుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు పురుషులు పరస్త్రీలపై ఆకర్షితులై వారి జీవితాలనే నాశనం చేసుకుంటున్నారన్నారు. సురక్షిత శృంగారం కోసం కండోమ్స్ వాడాలని, ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణకు కృషి చేయాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ నివారణకు అందరూ కృషి చేయాలని ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తేజస్విని అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఐసీటీసీ, కృషి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది తంబళ్లపల్లెలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కూడలిలో మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శివప్రసాద్ గౌడ్, సుమలత, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఓఆర్‌డబ్ల్యూ సావిత్రి, పల్లవి, ప్యారి, వసంత, నాగరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మహమ్మారిపై అవగాహన ర్యాలీ

బి.కొత్తకోట, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.కొత్తకోట పట్టణంలో వైద్యసిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఆరీఫుల్లా, డాక్టర్ హసీనా స్థానిక ఐసీటీసీ కేంద్రంలో ఎయిడ్స్ పరీక్షలు, అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆనంద్, లక్ష్మీకాంత్, భారతి, జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక చైతన్యమే మార్గం

పీలేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యమే ఎయిడ్స్ నియంత్రణకు మార్గమని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని సోమవారం పీలేరు ఆసుపత్రిలోని ఐసీటీసీ సిబ్బంది, టీబీ యూనిట్, తలపుల, రేగుళ్ల పీహెచ్‌సీల సిబ్బంది, 'కోర్' సంస్థ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ గురించి తెలుసుకోవాలని, ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటిస్తూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, కలుషితమైన సిరంజీలు, సూదులను వినియోగించరాదన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేసి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌ఎంవో డాక్టర్ సరస్వతి, వైద్యులు నాగవేణి, మాధవీలత, సుమలత, పవన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు 'కోర్' సంస్థ సభ్యులు సుమలత, శైలజ, సుభాషిణి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

వాల్మీకిపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించుకుంటేనే నియంత్రణ చేయవచ్చునని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జులేఖాబేగం తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అలాగే వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో సీహెచ్‌వో అరుణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సూపర్‌వైజర్‌లు బహద్దీన్, బానుబీ, గీతారాణి, హృదయాశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రూరల్ రిక్రియేషన్ సొసైటీ తరపున ఫీల్డ్ కౌన్సిలర్ సునీత ఆధ్వర్యంలో స్థానిక కళాశాల నుంచి బస్టాండు సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో శివరామయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


పీలేరులో జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

టౌన్‌బ్యాంకు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టౌన్‌బ్యాంకు స్థాపించి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బ్యాంకు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా సూచించారు. సోమవారం స్థానిక బ్యాంకులో బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్‌తో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఏర్పాట్లపై సమీక్షించారు. బుగ్గకాలువలోని ఎన్‌వీఆర్ కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం జరిగే ఈ ఉత్సవాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లు, ఖాతాదారులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కర్ కుమార్, డైరెక్టర్లు సోమశేఖర్, పసుపు రవి, ఎన్.రవికాంత్, నాదెళ్ల శివప్రసాద్, బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్, మేనేజర్ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

4న ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 4న షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మార్గశిర పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం, సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం, రాత్రికి అభయాంజనేయస్వామికి పౌర్ణమి వెలుగులో వడమాల సమర్పణ, సింధూర, ఆకు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● పరిశీలకుడు శ్రీకాంత్


నగిరిమడుగులో పోలింగ్‌బూత్ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీకాంత్

వాల్మీకిపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ పోలింగ్‌బూత్ పరిశీలకుడు ఎం.శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని నగిరిమడుగు, బురుజుగడ్డ, మూరేవాండ్లపల్లె పోలింగ్ బూత్ సభ్యులు, పార్టీ నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులంతా ఏకంగా ఉండాలన్నారు. కేవలం ఉనికి కోసమే ఎన్డీఏ ప్రభుత్వం, టీడీపీ నేతలపై వైసీపీ విమర్శలు చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతి, అక్రమాలకు ప్రస్తుతం వారు జైళ్ల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ శ్రేణులకు అండగా ఉన్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో త్వరలో జరిగే అన్ని ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించేలా పనిచేయాలన్నారు. కార్యక్రమాల్లో వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రాజేంద్రాచారి, పీవీ.నారాయణ, తాహీర్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లాకు కృష్ణదేవరాయల పేరు పెట్టాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లాకు శ్రీకృష్ణదేవరాయల పేరును పెట్టాలని రాయల్‌యూత్ సొసైటీ నాయకులు రేగడి ప్రసాద్‌కుమార్, మునిగోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె జిల్లాలోకి వచ్చే నాలుగు నియోజకవర్గాల్లో కృష్ణదేవరాయల చరిత్ర, ఆయన సంస్కృతి ఎక్కువగా కనిపిస్తోందన్నారు. అదే విధంగా రాయల పీపుల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కూడా శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయలగణి, రామచంద్ర, జయరామ్, వేణు, కొండయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువుల డీలర్ల సంఘం ఏర్పాటు

కలికిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్న ఎరువుల డీలర్లు సంఘంగా ఏర్పాటయ్యారు. కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, పెద్దమండెం మండలాల్లోని డీలర్లు సోమవారం కలికిరిలో సమావేశమై డీలర్ల సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ఐదు మండలాల్లోని 135 మంది డీలర్లు సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కలకడకు చెందిన బాబునాయుడు, ప్రధాన కార్యదర్శిగా మహల్‌కు చెందిన మహ్మదాలీ, ఉపాధ్యక్షులుగా వాల్మీకిపురానికి చెందిన సత్యారెడ్డి, కలికిరికి చెందిన సీవీ భాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. డీలర్లంతా స్టాకు రిజిస్టరు, విక్రయాల వివరాలు, ఇతర లైసెన్సులను తాజాగా చక్కదిద్దుకుని నిబంధనల మేరకు నిర్వహించాలని సభ్యులకు సూచించారు.

ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న పాలగిరి సిద్ధా



ఘనంగా శంకర్‌యాదవ్ పుట్టినరోజు

ములకలచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు సర్కిల్‌లో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా ఆధ్వర్యంలో తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చెన్నకిష్టా, ముత్తుకూరు మౌలా, సుధాకర్‌నాయుడు, కట్టా చలపతి, సురేంద్రనాయుడు, నాగరాజు యాదవ్, ఊరగాయల రామచంద్ర, సోమశేఖర్, సుదర్శన్, మహేష్, బయన్న, నాగమల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ జన్మదినాన్ని సోమవారం బి.కొత్తకోట పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, మండల కన్వీనర్ నారాయణ స్వామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జ్యోతి చౌక్‌లో భారీ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. బాణసంచా పేల్చి సంబరం చేసుకున్నారు. బస్టాండు కూడలిలో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో బంగారు వెంకట్రమణ, కనకంటి ప్రసాద్, సుకుమార్, కురవ ప్రకాశ్, రాజా, సురేంద్ర, రంజిత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాలుకా సీఐ కళా వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని తట్టివారిపల్లె గ్రామ సచివాలయంలో గ్రామపంచాయతీ సెక్రటరీ రవి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రోడ్డు భద్రతపై, సైబర్ నేరాలపై, మహిళలు, ట్రాఫిక్ రూల్స్, చైల్డ్ లేబర్, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శ్రావణి, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ముసురేసిన దిత్వా

● చలితో వణికిపోతున్న జనం

వాల్మీకిపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా దిత్వా తుఫాను ఓ క్రమంలో కొనసాగినప్పటికీ సోమవారం మాత్రం పూర్తిగా మారిపోయింది. వాతావరణం మొత్తం హిమాలయాలను తలపించే దిశలో ఈదురు గాలులతో కురుస్తున్న ముసురు వర్షం ఏకధాటిగా కొనసాగడం ఉష్ణోగ్రత్తలపై సైతం ప్రభావం చూపింది. ఉదయం నుండి 21డిగ్రీలు చూపిన ఉష్ణోగ్రత్తను సాయంత్రానికి 19డిగ్రీలుగా నమోదు కావడంతో జనం చలికి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుండి వాతావరణం పూర్తిగా మారిపోయి చీకటి వాతావరణాన్ని తలపించింది. దిత్వా తుఫాను ధాటికి ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి. ముసురుకున్న వర్షంతో చలికి తట్టుకోలేక జనం విలవిలలాడిపోయారు.


వాల్మీకిపురంలో ముసురేసిన దిత్వా తుఫాను దృశ్యాలు

రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం ఆయన రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీలో పెన్షన్ల పంపిణీతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై యూరియా, వడ్ల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఉచిత బస్సుప్రయాణం, అమ్మకు వందనం పథకంతో రూ.15వేలు అందించారన్నారు. కార్యక్రమంలో ఏవో మంజుల, టీడీపీ మండల అధ్యక్షుడు వెంటరమణ, మాజీ జడ్పీటీసీ మునిరత్నం, మాజీ మండల అధ్యక్షుడు రాజన్న, సర్పంచ్ రెడ్డెప్ప, సుజాత పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని మదనపల్లె ఏపీఎస్‌ఆర్టీసీ-1, 2 డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి అన్నారు. సోమవారం 14వ వార్డులో లబ్ధిదారులకు సచివాలయ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగూర్‌వలి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగుతోందని, ఎన్నికల హామీ మేరకు మదనపల్లె జిల్లాను ప్రకటించి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని ప్రశంసించారు.

నిమ్మనపల్లిలో 96శాతం పంపిణీ

నిమ్మనపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్ల పంపిణీలో జిల్లాలో నిమ్మనపల్లికు మొదటి స్థానం దక్కిందని ఎంపీడీవో ఫక్రుద్దీన్, ఏవో రమేశ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం పెన్షన్లు 5037వుండగా 4794 పంపిణీ చేసి 96శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు ఆయా గ్రామ పంచాయతీల్లో ఉదయం నుండే టీడీపీ నాయకుల చేతుల మీదుగా పెన్షన్ల పంపిణీని ప్రారంభించినట్లు తెలిపారు.కాగా పెన్షన్లు తీసుకోని అబ్ధిదారులు ఈనెల 2వ తేదీన సచివాలయాల్లో తీసుకోవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌చార్జి సుధాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో 95శాతం..

తంబళ్లపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నేతలు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నేతలు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తున్నా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 95.06 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

పీలేరులో 93 శాతం..


పీలేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావాన్ని సైతం లెక్కచేయకుండా సోమవారం పీలేరు మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. వేకువజాము నుంచే అధికారులు, టీడీపీ నాయకులు గ్రామగ్రామాన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను డబ్బులు అందించారు. మండలంలో మొత్తం 9673 పింఛన్లు ఉండగా 8923 (93 శాతం) పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి...


ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న టీడీపీ నేతలు

మదనపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి సోమవారం టీడీపీ నేతలు అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు. స్థానిక 13 వార్డు మోతీనగర్‌కు చెందిన ధర్మరాజు ఐసీయూలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నేత ఎస్.ఎ.మస్తాన్, వార్డు ఇన్‌చార్జి ఎస్.నస్రీన్‌తాజ్ నక్కలదిన్నెలోని ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే 13వవార్డుపరిధిలో ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు.


డిప్యూటీ ఎంపీడీవోగా చక్రపాణి



కలకడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవోగా చక్రపాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వాల్మీకీపురం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తూ పదోన్నతి పొంది బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి తగు సూచనలు ఇస్తూ ప్రజలకు సకాలంలో సేవలందిస్తామని తెలిపారు.

మురుగునీటి సమస్యపై ఫిర్యాదు

పీలేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ బండమీద దళితవాడలో నెలకొన్న మురుగునీటి సమస్యపై సోమవారం ఏబీఎంఎస్ జేపీసీ సభ్యులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏబీఎంఎస్ జేపీసీ పీలేరు మండల అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ బండమీద దళితవాడలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామమంతా దుర్గంధం వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎంఎస్ జేపీసీ సభ్యులు గుర్రం నారాయణ, రమేశ్, లోకనాథం, సురేంద్ర, శివ, నాగేంద్ర, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఏబీఎంఎస్ జేపీసీ సభ్యులు